ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



పెద్దపల్లి

జిల్లా వార్తలు

5★

ఆదివారం 15 డిసెంబరు 2024

న్యూస్ బాక్స్

నేడు పాలకవర్గ ప్రమాణ స్వీకారం

పెద్దపల్లి, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం ప్రమాణ స్వీకారం ఈ నెల 15వ తేదీన జరగనున్నది. కార్యక్రమానికి పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు హాజరు కానున్నారు.

వాటర్ కూలర్ వితరణ

సుల్తానాబాద్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : సుల్తానాబాద్ జూనియర్ సివిల్ కోర్టుకు స్థానిక ఎస్‌బీఐ బ్యాంక్ అధికారులు వాటర్ కూలర్‌ను వితరణ చేశారు. కోర్టుకు వచ్చే కక్షిదారులకు తాగునీటి సౌకర్యం కల్పించాలన్న ఉద్దేశ్యంతో బ్యాంక్ వారు వాటర్ కూలర్‌ను అందించగా, శనివారం జూనియర్ సివిల్ జడ్జి దుర్గం గణేష్ ప్రారంభించారు. వాటర్ కూలర్ ఏర్పాటుకు సహకరించిన బ్యాంక్ మేనేజర్ మహేష్ చంద్రను జడ్జి గణేష్‌తోపాటు బార్ అసోయేషన్ అధ్యక్షుడు పడాల శ్రీరాములు, మాజీ అధ్యక్షులు వొడ్నాల రవీందర్, ఎస్‌బీఐ ప్యానల్ అడ్వకేట్ ఆవుల లక్ష్మీరాజం అభినందించారు.

రేపు జిల్లా స్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలు

సుల్తానాబాద్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : సుల్తానాబాద్ పట్టణంలో ఈనెల 16న జిల్లాస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలను నిర్వహించనున్నట్లు టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షుడు కోడెం అజయ్, కార్యదర్శి బొల్లి సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. బాలబాలికలకు 11, 13, 15, 17, 19 ఏళ్ల విభాగాల్లో పోటీలు ఉంటాయని, ఆసక్తిగల వారు 16న ఉదయం 9గంటలకు ఇండియన్ పబ్లిక్ స్కూల్ మైదానంలో జరిగే పోటీల కార్యక్రమానికి హాజరుకావాలని కోరారు.

అమల్లోకి పెరిగిన చార్జీలు

- మార్కెట్ ధరలకు అనుగుణంగా మెస్, కాస్మెటిక్ చార్జీలు..
- న్యూకామన్ డైట్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యేలు, అధికారులు
- జిల్లాలో 10 వేల మంది విద్యార్థులకు ప్రయోజనం

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

ప్రభుత్వ వసతి గృహాలు, గురుకుల విద్యాలయాల్లోని విద్యార్థుల మెస్‌చార్జీలు, కాస్మెటిక్ చార్జీలను గత నెల 1వ తేదీన ప్రభుత్వం పెంచింది. శనివారం నుంచి పెరిగిన చార్జీలు అమల్లోకి వచ్చాయి. దీంతో ఇక నుంచి విద్యార్థులకు నాణ్యమైన, పౌష్టికాహారం అందనున్నది. ఎనిమిది సంవత్సరాల తర్వాత ఈ చార్జీలు పెరిగాయి. బహిరంగ మార్కెట్‌లో ఉన్న నిత్యావసర సరుకులు, కూరగాయలు, కోడిగుడ్లు, చికెన్, మాంసానికి అనుగుణంగా 40 శాతం మెస్ చార్జీలను, 200 శాతం వరకు కాస్మెటిక్ చార్జీలను పెంచడం వల్ల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. 3 నుంచి 7వ తరగతి చదివే విద్యార్థులకు నెలకు 950 రూపాయలు ఇస్తుండగా, ప్రస్తుతం 1330 రూపాయలకు పెంచారు. 8 నుంచి 10వ తరగతి చదివే విద్యార్థులకు 1100 నుంచి 1540 రూపాయలకు పెంచారు. ఇంటర్ నుంచి పీజీ చదివే విద్యార్థులకు 1500 నుంచి 2100 రూపాయలకు పెంచారు. కాస్మెటిక్ చార్జీలను బాలికలకు 7వ తరగతి వరకు 55 నుంచి 175 రూపాయల వరకు, 11 సంవత్సరాల వయస్సు పైబడిన బాలికలకు 75 నుంచి 275 రూపాయలకు పెంచారు. దీంతో పెరిగిన చార్జీలతో విద్యార్థులకు ప్రయోజనం చేకూరనున్నది. బాలురకు 7వ తరగతి వరకు 62 నుంచి 150 రూపాయలకు, 11 సంవత్సరాల వయస్సు పైబడిన బాలురకు 62 నుంచి 200 రూపాయల వరకు పెంచారు. ఈ మెస్ చార్జీలకు అనుగుణంగా ప్రభుత్వం రూపొందించిన న్యూ కామన్ డైట్ మెనూను వివిధ గురుకుల విద్యాలయాల్లో ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అన్నయ్యగౌడ్, కలెక్టర్ కోయ శ్రీహర్ష, అదనపు కలెక్టర్ డి వేణు, ఆయా శాఖల అధికారులు ప్రారంభించారు. విద్యార్థులతో కలిసి భోజనాలు చేశారు. రాష్ట్రంలో చివరగా ఎనిమిదేళ్ల క్రితం మెస్ చార్జీలను పెంచారు. ఆ తర్వాత నుంచి మెస్ చార్జీలు, కాస్మెటిక్ చార్జీలు పెరగక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఎప్పుడో పెంచిన మెస్ చార్జీలు అమల్లో ఉన్నాయి. గడిచిన ఐదేళ్లలో నిత్యావసర వస్తువులు, కూరగాయలు, కిరాణ సరుకులు రెండు, మూడింతలు పెరిగినా కూడా విద్యార్థులకు ఇచ్చే మెస్ చార్జీలు మాత్రం పెరగలేదు. దీంతో విద్యార్థులకు నాణ్యమైన, పౌష్టికాహారం లభించక తంటాలుపడ్డారు. గత ఏడాది మార్చిలో అన్ని విభాగాల్లోని వసతి గృహాలు, గురుకుల విద్యాలయాల్లోని విద్యార్థులకు ఇచ్చే మెస్ చార్జీలను 25 శాతం పెంచుతున్నామని అప్పటి సీఎం కేసీఆర్ ప్రకటించారు. దీంతో విద్యార్థులు ఎంతో సంబరపడ్డారు. కానీ ఆ ప్రకటన అమల్లోకి రాలేదు.



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష, చిత్రంలో ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్

తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం అప్పటివరకు అంతంత మాత్రంగానే ఉన్న గురుకుల విద్యాలయాల సంఖ్యను పెంచింది. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి రెండు చొప్పున బీసీ గురుకులాలు, ఒక మైనార్టీ, రెండు ఎస్సీ గురుకులాల విద్యాలయాలను మంజూరు చేసి ఏర్పాటు చేసింది. వీటితో పాటు సాధారణ వసతి గృహాలు, కస్తూర్బా గాంధీ బాలికల గురుకుల విద్యాలయాల్లో చదివే విద్యార్థులకు ఉదయం టిఫిన్, మధ్యాహ్నం, రాత్రి భోజనం, సాయంత్రం స్నాక్స్, పాలు, టీ అందజేసేందుకు ప్రభుత్వం మెస్ చార్జీలతో పాటు రూపాయికే కిలో బియ్యం అందజేసింది. ప్రభుత్వం ఇచ్చే మెస్ చార్జీలతో విద్యార్థులకు వంట చేసేందుకు గ్యాస్, కూరగాయలు, మాంసం, కోడిగుడ్లు, పండ్లు, కిరాణ సరుకులను కొనుగోలు చేసి నిర్ధేశించిన మెనూ ప్రకారం భోజనాలు, టిఫిన్లు, స్నాక్స్ పెట్టాల్సి ఉంటుంది. 3 నుంచి 7వ తరగతి చదువుతున్న విద్యార్థులకు 950

మిగతా 8వ పేజీలో..

ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు సునీల్‌రెడ్డి



సమ్మెలో పాల్గొని ఉద్యోగులకు మద్దతు తెలుపుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు సునీల్‌రెడ్డి, ఇతర నాయకులు

పెద్దపల్లి రూరల్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : విద్యాశాఖలో విధులు నిర్వహిస్తున్న సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షుడు సునీల్ రెడ్డి అన్నారు. పెద్దపల్లి మండల పరిషత్ కార్యాలయం సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు ఐదు రోజులుగా చేపడుతున్న సమ్మెకు బీజేపీ ఆధ్వర్యంలో సంఘీభావం తెలిపారు. అనంతరం సునీల్‌రెడ్డి మాట్లాడుతూ కొన్నేళ్లుగా విద్యాశాఖలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులందరిని రెగ్యులరైజ్ చేయాలని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ఇచ్చిన హామీలను వెంటనే అమలుచేయాలన్నారు. అలాగే ట్రస్మా రాష్ట్ర ముఖ్యసలహాదారులు యాదగిరి శేఖర్‌రావు, డీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ రాజ్‌కుమార్, డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మల్లేశ్వర్‌రావు, సీహెచ్ పోచయ్య, దక్షిణ్ గౌడ్, లింగం శ్రీనివాస్, గోల్కొండ శ్రీధర్, లక్ష్మణ్‌కుమార్ తదితరులు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాక్ అధ్యక్షులు తిప్పని తిరుపతి, కేజీబీవీ రాష్ట్ర నాయకురాలు సంధ్యారాణి, రాజ్‌కుమార్, మల్లయ్యలతో పాటు పలువురు పాల్గొన్నారు.

● పెద్దపల్లిటౌన్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు స్థానిక అమరవీరుల స్థూపం వద్ద నిర్వహిస్తున్న దీక్షకు శనివారం సీపీఐ మద్దతు ప్రకటించింది. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం ఉద్యోగుల దీక్షకు మద్దతు ప్రకటించారు. ఉద్యోగుల డిమాండ్లను వెంటనే ముఖ్యమంత్రి నెరవేర్చాలని కోరారు.

లోక్ అదాలత్‌తో సత్వర న్యాయం..

కోల్‌సిటీ, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): లోక్ అదాలత్‌లతో సత్వర న్యాయం సాధ్యపడుతుందని గోదావరిఖని అదనపు జిల్లా న్యాయమూర్తి డాక్టర్ టీ శ్రీనివాసరావు, సీనియర్ సివిల్ జడ్జి జీవన్ సూజర్‌సింగ్, మున్సిఫ్ మేజిస్ట్రేట్‌లు నల్లాల వెంకట సచిన్‌రెడ్డి, వెంకటేష్ దుర్వ అన్నారు. ఈ మేరకు శనివారం గోదావరిఖని జిల్లా, సీనియర్ సివిల్ జడ్జి, మున్సిఫ్ కోర్టులలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో వారు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. కక్షలతో డబ్బు, సమయాన్ని వృథా చేసుకోరాదన్నారు. లోక్ అదాలత్‌ల ద్వారా రాజీ కుదుర్చుకుంటే ఒక్కరు గెలిచి,మరొకరు ఓడినట్టు కాదన్నారు. అనంతరం లోక్ అదాలత్‌లో క్రిమినల్ సివిల్, గృహహింస, చెక్‌బౌన్స్, మోటార్ వాహన ప్రమాద బీమా కేసులలో రాజీ కుదిర్చారు. ఈ కార్యక్రమాల్లో అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ నమేధ ఫర్వీన్, లోక్ అదాలత్ సభ్యులు రాగిణి, అంజలి, పద్మజ, సంపత్, శ్యామ్, సంతోష్, భానుకృష్ణ, భూమయ్య పాల్గొన్నారు.



ఆయిల్‌పామ్ సాగుపై శిక్షణ..

- రెబ్బల్‌దేవ్‌పల్లిలో 40 ఎకరాల్లో నర్సరీ
- ఎనిమిది లక్షల మొక్కల పెంపకం..

7

రెబ్బల్‌దేవ్‌పల్లిలోని ఆయిల్‌పామ్ నర్సరీ



గురుకులాలపై తల్లిదండ్రులకు నమ్మకం కలిగించాలి

- పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు

8

భోజనం నాణ్యతను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

మానవత్వం చాటుకున్న అడ్లూరి

ధర్మారం, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మానవత్వం చాటుకున్నారు. మండలంలోని బంజర్‌పల్లె వద్ద పెర్కపల్లె గ్రామస్తులు రోడ్డుప్రమాదంలో గాయపడగా అటుగా వెళ్తున్న లక్ష్మణ్ కుమార్ గాయపడిన వారిని తన వాహనంలో ఆసుపత్రికి తరలించారు.

ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధికి కృషి

- ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు



కల్యాణలక్ష్మి చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

కాల్వశ్రీరాంపూర్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : కాల్వశ్రీరాంపూర్ ప్రభుత్వ ఆసుపత్రిని 30 పడకల ఆసుపత్రిగా మార్చి అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో 15మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పది సంవత్సరాలకు పూర్వం కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండగా కాల్వశ్రీరాంపూర్ ప్రభుత్వ ఆసుపత్రి కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌గా ఉండేదని టీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామీణ ప్రాంతంలో ఉన్న ఆసుపత్రిని ఆరు పడకల ఆసుపత్రిగా ప్రైమరీ హెల్త్ సెంటర్‌గా మార్చి టీఆర్ఎస్ ప్రభుత్వం వైద్యంను నిర్వీర్యం చేశారన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి విద్యతోపాటు వైద్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి అభివృద్ధికి నిధులు మంజూరు చేయించడం జరిగిందని, ఈ ఆసుపత్రికి కూడా నిధులు మంజూరు చేయించి మళ్లీ 30పడకల ఆసుపత్రిగా ఏర్పాటు చేసి ఆసుపత్రిలో అన్ని సౌకర్యాలు కల్పిస్తామన్నారు. త్వరలో ఇల్లులేని వారందరికీ ప్రభుత్వం ఇందిరమ్మ ఇల్లు ఇస్తుందన్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం సంక్షేమ పథకాలతో ముందుకు పోతుందన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో కూడా రైతులకు రెండు లక్షల రుణమాఫీ కాలేదని సీఎం రేవంత్‌రెడ్డి మాట ఇచ్చిన ప్రకారం రైతులందరికీ రుణమాఫీ చేయడం జరిగిందన్నారు. ఈ నియోజకవర్గంలో రైతులు పండించిన వరిధాన్యంకు గింజ కటింగ్ లేకుండా ప్రభుత్వం ధాన్యం కొని 48 గంటలలోపే ధాన్యం డబ్బులు వేయడం జరిగుతుందన్నారు. సంక్రాంతిలోపు రైతు భరోసా ఇస్తామన్నారు. నూతన తహసీల్దార్ కార్యాలయం నిర్మాణంకు 50లక్షలు మంజూరు చేశామని, త్వరలో పనులు కూడా ప్రారంభిస్తామన్నారు. తహసీల్దార్ కార్యాలయంకు నిధులు మంజూరుచేసిన సందర్భంగా ఎమ్మెల్యేను తహసీల్దార్ ఎండి వకీల్, డిప్యూటీ తహసీల్దార్ గర్రెపల్లి శంకర్‌లు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఎండి.వకీల్, మాజీ ఎంపీపీ గోపగోని సారయ్యగౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గాజనవేణ సదయ్య, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ రామిడి తిరుపతిరెడ్డి, వైస్‌చైర్మన్ పబ్బని రాజమల్లు, సింగిల్‌విండో డైరెక్టర్లు ఎనగంటి రవి, మాజీ జడ్పీటీసీ లంక సదయ్య, నాయకులు మాదాసు సతీష్, బంగారు రమేష్, సన్నాయి టింకమ్ శివరామకృష్ణ, శ్రవణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్-2 పరీక్షలకు సర్వం సిద్ధం

- జిల్లావ్యాప్తంగా 18 పరీక్ష కేంద్రాలు

పెద్దపల్లి కల్చరల్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిబంధనలను పాటిస్తూ అభ్యర్థులు ప్రశాంతంగా గ్రూప్-2 పరీక్షలకు హాజరు అయ్యేలా జిల్లా అధికారులు పకడ్బందీగా చర్యలు చేపట్టారు. జిల్లావ్యాప్తంగా 18 పరీక్ష కేంద్రాల్లో ఆదివారం ఉదయం నుంచి సోమవారం సాయంత్రం వరకు జరగనున్న నాలుగు పేపర్లను ఎలాంటి అవకతవకలు లేకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. ఈనెల 15,16 తేదీలలో ఉదయం 10 గంటల నుంచి 12.30 గంటల వరకు, మధ్యాహ్నం 3 గంటల నుంచి 5.30 గంటల వరకు రెండు సెషన్లలో 4పరీక్షలు జరుగనున్నాయి. జిల్లాలో మొత్తం 9వేల 18 మంది అభ్యర్థులు ఈ పరీక్షలు రాయనున్నారు. వీరి కోసం 18 పరీక్షా కేంద్రాలను సిద్ధం చేశారు. పరీక్ష కేంద్రాలకు అభ్యర్థులను ఉదయం సెషన్‌లో 8.30 నుంచి, మధ్యాహ్నం సెషన్‌లో 1.30 నుంచి అనుమతిస్తారు. ఉదయం 9.30గంటలకు, మధ్యాహ్నం 2.30 గంటలకు పరీక్ష కేంద్రాల గేటు మూసివేసే విధంగా ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతి ఇవ్వకుండా ఉండే విధంగా ప్రణాళికలు సిద్ధంచేశారు. దీని తర్వాత పరీక్ష కేంద్రాలకు ఎవరిని అనుమతించడం జరగదు. కావట్టి అభ్యర్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకోవాల్సి ఉంటుంది. అభ్యర్థులు పరీక్ష కేంద్రాలకు తమ వెంట బ్లూ/బ్లాక్ పాయింట్ పెన్నులు, ఫోటోతో కూడిన హాల్ టికెట్, ప్రభుత్వం జారీ చేసిన ఒరిజినల్ ఫొటో ఐడీ కార్డు తీసుకురావలసి ఉంటుంది. అలాగే హాల్ టికెట్‌పై పాస్‌పోర్టుసైజ్ ఫోటోను అంటించి తీసుకుని వస్తేనే అనుమతి ఉంటుంది. ఒకే హాల్ టికెట్‌ను పరీక్ష మొత్తం వినియోగించుకోవాల్సి ఉంటుంది. అభ్యర్థులు పరీక్ష కేంద్రానికి ఒక రోజు ముందు వచ్చి చూసుకునేలా ముందస్తు ప్రకటించారు. పరీక్ష కేంద్రాలకు అభ్యర్థులు క్యాలిక్యులేటర్ సెల్‌ఫోన్ పెన్ డ్రైవ్, బ్లూ టూత్ డివైసెస్, జువెలరీ, ఎలక్ట్రానిక్ గాడ్జెట్ మొదలగు సామగ్రి తీసుకుని రావడానికి వీల్లేదు. చెప్పులు మాత్రమే వేసుకుని రావాలని షూస్ వేసుకోవద్దని నిబంధనలను జారీ చేశారు. సెల్‌ఫోన్ బ్లూటూత్ ఇతర ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్ అభ్యర్థులు తీసుకువచ్చినట్లైతే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని, ఇది అభ్యర్థులు గమనించాలని ముందే పేర్కొన్నారు. బయోమెట్రిక్ ప్రక్రియ పూర్తయ్యే వరకు అభ్యర్థులు పరీక్ష హాల్ విడిచి వెళ్లరాదని, బయోమెట్రిక్ ఇవ్వని అభ్యర్థుల ఓఎంఆర్ షీట్ వ్యాలీడ్ కాదని, బయోమెట్రిక్ విధానం ఉన్న నేపథ్యంలో అభ్యర్థులు మెహందీ టాటూ వంటివి పెట్టుకోవద్దని ఆయా హాల్ టికెట్లలో నిబంధనలు జారీచేశారు. ప్రతి పేపర్ సమయంలో అభ్యర్థి ఇన్విజిలేటర్ సమక్షంలో హాల్ టికెట్‌పై సంతకం పెట్టాలని మోడల్ ఓఎంఆర్ షీట్లను వెబ్‌సైట్ నుంచి డౌన్లోడ్ చేసుకుని సరిగ్గా బబుల్స్ చేయడం ప్రాక్టీస్ చేయాలని, ఓఎంఆర్ షీట్‌ను సరిగా చెక్ చేసుకోవాలని, పరీక్ష ముగిసే వరకు అభ్యర్థులు పరీక్ష హాల్‌ను విడిచివెళ్లడానికి వీలులేదని ఆయా సెంటర్ల చీఫ్ సూపరింటెండెంట్లకు అబ్జర్వర్లకు డిపార్ట్మెంటల్ అధికారులకు సర్క్యూలర్ జారీ చేశారు. పరీక్ష తేదీ నుంచి మూడు నెలల్లోగా తీసిన అభ్యర్థి పాస్‌పోర్టు సైజు ఫొటోను పరీక్షా కేంద్రానికి వచ్చే ముందు హాల్ టికెట్‌లోని నిర్దేశిత స్థలంలో గమ్‌తో అతికించాలని లేకుంటే అభ్యర్థి దరఖాస్తు తిరస్కరణకు గురవుతుందన్న విషయాన్ని అభ్యర్థులు గమనించాల్సి ఉంటుంది.



ఇన్విజిలేటర్లలకు శిక్షణ ఇస్తున్న అబ్జర్వర్ లక్ష్మీనారాయణ

దివ్యాంగ అభ్యర్థులు తప్పనిసరిగా సదరమ్ సర్టిఫికెట్ చీఫ్ సూపరింటెండెంట్‌కు చూపించి, స్క్రైబ్ లేదా పరిహార సమయాన్ని క్లెయిమ్ చేయడానికి పరీక్ష రోజున హాల్ టికెట్‌పై స్క్రైబ్ అనుమతించబడిన అని ముద్రించిన అభ్యర్థులకు మాత్రమే స్క్రైబ్ సేవలు అందించబడుతాయి. అభ్యర్థులు తమ హాల్ టిక్కెట్‌పై ముద్రించిన సూచనలను తప్పకుండా పాటించాలని పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం మధ్యాహ్నం ఆయా పరీక్ష కేంద్రాల్లో హాల్ టికెట్ నంబర్లు అంటించారు. ఈ మేరకు రీజనల్ కోఆర్డినేటర్ ఆయా పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసి స్టిబందికి పలువు సూచనలు చేశారు. మెడికల్ సిబ్బందిని, పోలీస్ సిబ్బందిని అందుబాటులో ఉండే విధంగా చర్యలు చేపట్టారు. ప్రతి పరీక్షా కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలులో ఉండే విధంగా చర్యలు తీసుకున్నారు.

రేపటి నుంచి జిల్లా స్థాయి సీఎం కప్ క్రీడా పోటీలు


- జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి సురేష్

పెద్దపల్లి కల్చరల్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : గ్రామ స్థాయిలో క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సీఎం కప్ జిల్లా స్థాయి క్రీడాపోటీలు ఈనెల 16 నుంచి 21వ తేదీ వరకు జరగనున్నాయి. ఇందుకు సంబంధించి వివిధ క్రీడల అంశాలు, నిర్వహించనున్న వేదికల వివరాలను జిల్లా యూత్ క్రీడల శాఖ అధికారి సురేష్ విడుదల చేశారు. 16న బ్యాడ్మింటన్, యోగా (ఎస్సీఎం, మంథని), టీటీ (ఇండియన్ పబ్లిక్ స్కూల్, సుల్తానాబాద్)లో, 17న హ్యాండ్‌బాల్ సుల్తానాబాద్‌లో, 19న జూడో, రెజ్లింగ్(ఇండియన్ పబ్లిక్ స్కూల్, సుల్తానాబాద్) ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ (బాలికలు, మహిళలకు, ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం సుల్తానాబాద్)లో నిర్వహించనున్నారు. 20న హాకీ (యైటింక్లయిన్‌కాలనీ), 20న అథ్లెటిక్స్ (బాలబాలికలు, పురుషులు, మహిళలకు, ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం, సుల్తానాబాద్)లలో 21న ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ (బాలురు, పురుషులు, ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం, సుల్తానాబాద్)లో 16 నుంచి 21వరకు ఫుట్‌బాల్, చెస్, కరాటే, వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్ పోటీలు నిర్వహించనున్నారు. జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి సురేష్ మాట్లాడుతూ పోటీల నిర్వాహణకు కమిటీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

18న మున్సిపల్ కార్మికుల నిరసన దీక్షలు

- 19న చలో హైదరాబాద్ - సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు

పెద్దపల్లిటౌన్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికులు ఈనెల 18న నిరసన దీక్షలు చేపట్టనున్నట్లు సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు తెలిపారు. తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ కమిటీ సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముత్యంరావు మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ తాము అధికారంలోకి వస్తే మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేస్తామని, కనీస వేతనం 26వేల రూపాయలు ఇస్తామని ఎన్నికల ప్రణాళికలో పేర్కొందన్నారు. అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా ఎన్నికల ప్రణాళికలో పేర్కొన్న మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవడం లేదన్నారు. అదేవిధంగా పెద్దపల్లి మున్సిపాలిటీలో పనిచేస్తున్న కార్మికులకు ఒక సంవత్సరం సబ్బులు, బట్టలు, చెప్పులు, నూనె తదితర వస్తువులు రావాల్సి ఉందని, వాటిని వెంటనే ఇవ్వాలని, రామగుండం, కరీంనగర్ కార్పొరేషన్లలో ఉన్న విధంగా కార్మికులకు ఒక్క పూట పని చేయించాలని, పెరిగిన వేతనాల ఎరియర్స్ చెల్లించాలని, డైలీ వేజ్ పద్ధతిలో పనిచేస్తున్న కార్మికులను కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ విధానంలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యల పరిష్కారం కోసం ఈనెల 18న విధులు బహిష్కరించి జిల్లాలోని అన్ని మున్సిపాలిటీ ఆఫీసుల ఎదుట నిరసన దీక్షలు చేయాలని, 19న చలో హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద చేపట్టే ధర్నాలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం ఇప్పటికైనా ఎన్నికల వాగ్దానాల అమలుకు చర్యలు తీసుకొని మున్సిపల్ కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పెద్దపల్లి మున్సిపల్ యూనియన్ అధ్యక్షుడు ఆరెపల్లి చంద్రయ్య, యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సావనపల్లి వెంకటస్వామి, పెద్దపల్లి, మున్సిపాలిటీలో నాయకులు బొంకూరి సాగర్, కుక్కఅన్వేష్, మద్దెల రాజయ్య బొంకూర్ శంకర్, సలిగంటి సుశీల, కాంపెల్లి దేవమ్మ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ముత్యంరావు

17న ఆశా వర్కర్స్ బస్సు జాతా

కమాన్‌పూర్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఆశా వర్కర్స్ బస్సు జాతా ఈనెల 17న నిర్వహించనున్నట్లు తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షురాలు జ్యోతి తెలిపారు. శనివారం ఆమె మాట్లాడుతూ 17న జిల్లా కేంద్రానికి బస్సు జాతా వస్తుందని తెలిపారు. అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం బస్సు జాతా పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆశా వర్కర్లు అమృత, రమ, విజయ, గౌతమి, శ్యామల, లావణ్య, స్వప్న, కృష్ణవేణి, మల్లేశ్వరి, పుష్పలతలు ఉన్నారు.

క్రైం కార్నర్

శాంతిభద్రతలకు ఆటంకం.. ఇద్దరి అరెస్టు

సిరిసిల్ల క్రైం, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతలకు ఆటంకం కలిగించిన గంభీరావుపేట మండలంలోని ఆర్అండ్ఆర్ కాలనీ కి చెందిన శివరాత్రి లక్ష్మణ్, చల్ల సతీష్‌ను శనివారం అరెస్ట్ చేసినట్లు సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. నవంబరు 24న చల్ల రమేశ్ అనే వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మరణించడంతో ప్రమాదానికి కారణమైన వారి నుంచి పరిహారం ఇప్పించాలని అదేరోజు సిరిసిల్ల పట్టణంలోని అంబేద్కర్‌చౌరస్తా వద్ద రహదారిపై రాస్తారోకోతో ప్రజలకు ఇబ్బందులు కల్పించిన చల్ల బాలరాజు, చల్ల సతీష్, శివరాత్రి లక్ష్మన్, శివరాత్రి నరసవ్వ, శివరాత్రి భాగ్య శివరాత్రి సంతోష్, సంపంగి మల్లవ్వ, కొమ్మరాజు ఐలయ్యతోపాటు మరికొంతమందిపై కేసు నమోదు చేశారు. వారిలో ఇద్దరిని రిమాండ్‌కు తరలించారు. ప్రజలకు ఏదైనా సమస్య ఉంటే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి ఫిర్యాదు చేయాలని డీఎస్పీ తెలిపారు. విచారణ జరిపి చట్ట పరమైన చర్యలు తీసుకుంటా మన్నారు. చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకొని రోడ్ల మీదకు వచ్చి సామాన్య ప్రజలకు, శాంతి భద్రతలకు ఇబ్బందులు కలిగించేవారిపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు.

చికిత్సపొందుతూ వ్యక్తి మృతి


గొల్లపల్లి మధు(ఫైల్)

రామగిరి, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పన్నూరు గ్రామానికి చెందిన గొల్లపల్లి మధు(42) గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా చికిత్సపొందుతూ శనివారం మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వివాహమై సంవత్సరాలు గడుస్తున్నా సంతానం లేదనే బాధతో మానసికంగా కుంగిపోయిన మధు తాగుడుకు బానిసయ్యాడు. బుధవారం ఇంట్లో ఎవరూలేని సమయంలో గడ్డిమందు తాగి ఆపస్మారక స్థితిలోకి చేరుకున్నాడు. కుటుంబ సభ్యులు పెద్దపల్లి ఆసుపత్రికి తరలించగా వైద్యుల సలహా మేరకు కరీంనగర్‌కు, అక్కడినుంచి వరంగల్‌కు తరలించారు. పరిస్థితి విషమించడంతో శుక్రవారం అర్ధరాత్రి మృతిచెందాడు. మృతుడు మధు భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చంద్రకుమార్ తెలిపారు.

బైక్ ఢీకొని బాలికకు తీవ్ర గాయాలు

గన్నేరువరం, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మైలారం గ్రామంలో బైక్ ఢీకొని బాలిక(4)కు తీవ్ర గాయాలయ్యాయి. మండలంలోని ఖాసింపేట గ్రామానికి చెందిన బొజ్జ మహేందర్, శిరీష దంపతుల కూతురు బొజ్జ దీక్ష(4) తమ అమ్మమ్మ ఊరైన మైలారం గ్రామానికి తన తల్లితో కలిసి శనివారం ఉదయం వెళ్లింది. మధ్యాహ్నం అమ్మమ్మ ఇంటికి సమీపంలోని కిరాణా షాపునకు వెళ్లి తిరిగి వస్తుండగా సాంబయ్యపల్లి గ్రామానికి చెందిన గడ్డం మహేందర్‌రెడ్డి బైక్‌పై వెళ్తూ బాలికను ఢీకొట్టాడు. దీంతో దీక్ష తలకు, ముఖంపై తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే కుటుంబసభ్యులు, స్థానికులు చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో దంపతులు, బాలుడికి గాయాలు

ఎల్లారెడ్డిపేట డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని కొత్త బస్టాండ్ ప్రాంతంలో కామారెడ్డి సిరిసిల్ల ప్రధాన రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో దంపతులతోపాటు చిన్నారికి గాయాలయ్యాయి. వీర్నపల్లి మండలం మద్దిమల్ల గ్రామానికి చెందిన దంపతులు బానోతు ప్రకాష్, కవిత వారి రెండేళ్ల కొడుకు శివతో ద్విచక్ర వాహనంపై సిరిసిల్ల వైపునకు వెళ్తున్నాడు. కామారెడ్డి వైపు వెళ్లేందుకు ఆర్టీసీ బస్సు మండల కేంద్రంలోని కొత్త బస్టాండ్ ప్రాంగణంలోకి వెళ్తున్న క్రమంలో ఢీ కొన్నాయి. ప్రమాదంలో బానోతు ప్రకాష్, కవిత వారి రెండేళ్ల కొడుకు శివకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వివరించారు.

మెడికల్ కళాశాలకు వృద్ధురాలి పార్థివదేహం

కళ్యాణ్‌నగర్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): సింగరేణి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(సిమ్స్)కు ఈశ్వరకృప వృద్ధాశ్రమం ప్రతినిధులు వృద్ధురాలి పార్థివదేహాన్ని దానం చేశారు. వీర్లపల్లిలోని ఈశ్వరకృప వృద్ధుల ఆశ్రమంలో 11నెలలుగా కంటిచూపు లేకుండా బాధపడుతున్న ఎన్నాడి లక్ష్మి(78) అనే వృద్ధురాలు శనివారం మృతి చెందింది. ఆశ్రమ నిర్వాహకుడు పీటీ స్వామి సిమ్స్ కళాశాలలోని అనాటమి డిపార్ట్‌మెంట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ కల్పనకు లక్ష్మి పార్థివదేహాన్ని అప్పగించారు. అనంతరం విద్యార్థులు, ప్రొఫెసర్లు మృతదేహానికి గౌరవ వందనం చేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సదాశయ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి లింగమూర్తి, సాన రామకృష్ణారెడ్డి, కేఎస్‌వాసు, చంద్రశేఖర్, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు మల్లికార్జున్, రాంచందర్‌రావు, వెంకటయ్య ఉన్నారు.

విదేశాలకు పంపిస్తానని మోసం: వ్యక్తి అరెస్ట్

తంగళ్లపల్లి, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): విదేశాలకు పంపిస్తానని మోసగించిన తంగళ్లపల్లి మండలం సారంపల్లి గ్రామానికి చెందిన ఎండీ మహెబూబ్‌ను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ రామ్మోహన్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం సిద్దిపేట జిల్లా నారాయణరావుపేట మండలం మల్యాల గ్రామానికి చెందిన పెద్దపల్లి విజయ్‌కుమార్ అనే వ్యక్తిని విదేశాలకు పంపిస్తానని మోసగించి లక్ష రూపాయలు వసూలు చేసి తప్పుడు వీసాపై పంపించాడు. ఈ విషయంపై విజయ్‌కుమార్ తంగళ్లపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా మోసగించిన మోహబూబ్‌ను శనివారం ఆరెస్ట్ చేసినట్లు తెలిపారు.

వలస కార్మికుడి ఆత్మహత్య

జ్యోతినగర్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ప్రగతినగర్‌లో జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన కార్మికుడు దీపక్ కుమార్‌యాదవ్(20) అనే వలస కార్మికుడు శనివారం ఆత్మహత్య చేసుకున్నాడు. తన ఇంటికి సమీపంలోని చెట్టుకు టవల్‌తో ఉరివేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. దీపక్‌కుమార్ ఎన్టీపీసీలో కాంట్రాక్టు కార్మికుడిగా పనిచేస్తున్నాడు. అనారోగ్య కారణాలతో ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని కాలనీవాసులు అనుమానిస్తున్నారు. ఎన్టీపీసీ పోలీసులు ఆత్మహత్య ఘటనపై విచారణ చేపట్టారు. మృతుడి సంబంధీకులు ఎవరూ స్థానికంగా లేకపోవడంతో ఇప్పటివరకు పోలీసులకు ఫిర్యాదు అందలేదు.

ఊరి కోసం మన నేతలు



గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా
కోనరావుపేట మండల నేతలు తమదైన ముద్ర వేశారు. రాజకీయంగా కీలక పదవులు చేపట్టి ప్రజాప్రతినిధులుగా రాణిస్తూ సేవా కార్యక్రమాల్లో ప్రత్యేక గుర్తింపును సొంతం చేసుకున్నారు. - కోనరావుపేట

- రాజకీయాల్లో కీలక పదవులు
- సేవా కార్యక్రమాలతో ప్రత్యేక ముద్ర

■ రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం నాగారంలో పుట్టి పెరిగిన చెన్నమనేని రాజేశ్వరరావు గతంలో కమ్యూనిస్టు ఉద్యమంలో కొనసాగారు. రజాకార్లకు వ్యతిరేకంగా పోరాటం చేశారు. సిరిసిల్ల నియోజకవర్గం నుంచి ఆరుసార్లు ఎమ్మెల్యేగా పోటీ చేసి గెలుపొందారు. ఆయన కుమారుడు చెన్నమనేని రమేష్ బాబు జర్మనీకి చెందిన సేవ్స్ స్వచ్ఛంద సంస్థ చైర్మన్‌గా ఉంటూ ఆ సంస్థ ద్వారా వేములవాడ నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో వాటర్ ప్లాంట్లు, వాటర్ ట్యాంకులు, పైపులైన్లు ఏర్పాటు చేయించారు. అనంతరం వేములవాడ నియోజకవర్గం నుంచి సుదీర్ఘకాలం ఎమ్మెల్యేగా పనిచేశారు.


■ ఇదే కుటుంబంలో దివంగత ఎమ్మెల్యే చెన్నమనేని రాజేశ్వరరావు తమ్ముడు చెన్నమనేని విద్యాసాగర్‌రావు బీజేపీ నుంచి ఎమ్మెల్యేగా, కేంద్ర సహాయ మంత్రిగా పనిచేశారు. మహారాష్ట్ర గవర్నర్‌గా సేవలు అందించారు. పుట్టి పెరిగిన నాగారం గ్రామంలో యువకుల ఉపాధి కోసం ఉచిత వృత్తి విద్య శిక్షణ కేంద్రాన్ని జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ ద్వారా యువకులకు ఉపాధి కల్పిస్తున్నారు. నాగారం గ్రామంలోని గుట్టపైన ఆధ్యాత్మికతను పెంపొందించేందుకు భారీ ఆంజనేయ విగ్రహాన్ని ఏర్పాటు చేయడమే కాకుండా శ్రీరామచంద్రస్వామి ఆలయాన్ని నిర్మించారు. ప్రస్తుతం తన కుమారుడు చెన్నమనేని వికాస్‌రావును ప్రజలకు పరిచయం చేస్తూ బీజేపీలో చేర్పించారు ప్రస్తుతం బీజేపీ వేములవాడ నియోజవర్గ ఇన్‌చార్జిగా కొనసాగుతున్నారు. బీజేపీలోకి రాకముందే ప్రతిమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పలు గ్రామాల్లో వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేశారు. కుట్టుమిషన్లను పంపిణీ చేశారు. వేములవాడ నియోజకవర్గంలో మెరుగైన వైద్య సేవలు అందించేందుకు 108 అంబులెన్స్‌లను ఏర్పాటు చేశారు.

■ మల్కాపేట గ్రామంలో పుట్టి పెరిగిన చల్మెడ ఆనందరావు సిరిసిల్ల ఎమ్మెల్యేగా గెలిచి న్యాయశాఖ మంత్రిగా పనిచేశారు. ప్రస్తుతం వృద్ధాప్యంలో ఉన్న ఆయన పుట్టి పెరిగిన గ్రామానికి ఏదో చేయాలని తపనతో కుటుంబ సభ్యుల సహకారంతో ఆరు కోట్లతో శ్రీరామచంద్రస్వామి ఆలయం, మూడు కోట్లతో విద్యాలయాన్ని నిర్మించారు. ఆయన కుమారుడు చల్మెడ లక్ష్మీనరసింహారావు, కరీంనగర్ చల్మెడ ఆసుపత్రి చైర్మన్ కొనసాగతుఉన్నారు. ప్రస్తుతం బీఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్నారు. లక్ష్మీనరసింహారావు వేములవాడ నియోజకవర్గంలో పేదల కోసం వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నారు.



మల్కాపేటలో చల్మెడ లక్ష్మీనర్సింహారావు తండ్రి ఆనందరావు సహకారంతో రూ. 2 కోట్లతో నిర్మించిన ఆధునిక పాఠశాల


నాగారంలో మహారాష్ట్ర మాజీ గవర్నర్ చెన్నమనేని విద్యాసాగర్‌రావు ప్రోత్సాహంతో జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ నిర్వహిస్తున్న ఉచిత వృత్తి విద్య శిక్షణ కేంద్రం


చెన్నమనేని రమేశ్‌బాబు ఆధ్వర్యంలో మంగళపల్లిలో మొదటిసారిగా సేవ్ స్వచ్ఛంద సంస్థ నిర్మించిన వాటర్ ట్యాంక్

రేషన్ బియ్యం పట్టివేత


పోలీసులు పట్టుకున్న రేషన్ బియ్యం

మల్లాపూర్, డిసెంబరు, 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేంపల్లి గ్రామం నుంచి అక్రమంగా తరలిస్తున్న 30 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం రాత్రి వచ్చిన సమాచారం మేరకు ఎస్సై కిరణ్‌తో పాటు సిబ్బందితో వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈక్రమంలో మల్లాపూర్ మండలంలో సేకరించిన రేషన్ బియ్యాన్ని టీఎస్ 18టీ 5471 నంబరు గల వాహనంలో తరలిస్తుండగా వేంపల్లి గ్రామంలో పట్టుకున్నట్లు తెలిపారు. పట్టుకున్న వాహనాన్ని పోలీసుస్టేషన్‌కు తరలించి వారి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

సమాజ విలువలు పెంపొందించేందుకే కవితలు

- సినీ గేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ


సంపుటిని ఆవిష్కరిస్తున్న సినీగేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ

మెట్‌పల్లి రూరల్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): సమాజ విలువలు పెంపొందించేందుకు కవితల సారాంశం ఎంతగానో ఉపయోగపడుతుందని సినీ గేయ రచయిత, జాతీయ అవార్డు గ్రహీత సుద్దాల అశోక్‌తేజ అన్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయుడు పెరంబదూర్ లింబగిరిస్వామి రచించిన 'నిశ్శబ్ద యుద్ధం' కవితా సంపుటిని శనివారం మెట్‌పల్లి మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో ఆయన ఆవిష్కరించారు. ముందుగా జ్యోతి ప్రజ్వల చేసి సభ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల బాధలు, వారికి జరిగే అన్యాయాలు, దోపిడీ అణిచివేతలను ఎదుర్కొని సమాజ విలువలు పెంపొందించే విధంగా నిశ్శబ్ద యుద్ధం కవితా సంపుటిలో అక్షరబద్ధం చేశారన్నారు. ప్రతీ హృదయంలో సాహిత్యం వెల్లివిరియాలని ఆయన ఆకాంక్షించారు.

అనంతరం సుద్దాల అశోక్‌తేజను కవులు, అభిమానులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ కవి దాస్యం సేనాధిపతి, నాట్యాచార్యులు తిరుక్కోవెల లక్ష్మణస్వామి, గంద్ర ఆనం దరావు, దురిశెట్టి మనోహర్, సత్యనారాయణ, బాలె శివాజీ, శరత్‌చంద్ర, కేశవస్వామి, శ్రీనివాస్ స్వామి, ఉపాధ్యాయులు, కవులు, శ్రోతలు, అభిమానులు పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర విశ్వవిద్యాలయాల పోటీలకు ఎంపిక


పోటీలకు ఎంపికైన అఖిల్, మధు

సిరిసిల్ల టౌన్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): దక్షణాది అంతర్రాష్ట్ర విశ్వవిద్యాలయాల వాలీబాల్ పోటీలకు రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన ఈసరి అఖిల్ (చీర్లవంచ), సిరిపురం మధు (రుద్రంగి) శాతవాహన యూనివర్సిటీ నుంచి ఎంపికయ్యారు. ఈ నెల 18 నుంచి 22 వరకు ఐదు రోజులపాటు కేరళలోని తిరువనంతపురంలో జరిగే దక్షణాది అంతర్రాష్ట్ర విశ్వవిద్యాలయాల టోర్నమెంట్‌లో శాతవాహన యూనివర్సిటీ నుంచి అఖిల్, మధు పాల్గొననున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం చీర్లవంచ గ్రామానికి చెందిన అఖిల్, రుద్రంగి మండల కేంద్రానికి చెందిన మధు సిరిసిల్ల వీబీఏలో వాలీబాల్ శిక్షణ పొంది పలు టోర్నమెంట్లలో ప్రతిభ చాటాడు. గతంలో అఖిల్ జూనియర్స్, సీనియర్స్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా జట్టులో స్థానం సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. మధు ఎస్‌జీఎఫ్, జూనియర్స్ ఉమ్మడి కరీంనగర్ జట్టులో స్థానం సాధించి రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా చాటాడు.

వేములవాడ అగ్రహారం డిగ్రీ కళాశాలలో చదువుతూ శాతవాహన యూనివర్సిటీ స్థాయిలో ప్రతిభ కనబరిచిన అఖిల్ 2023-24లో మొదటిసారిగా దక్షణాది అంతర్రాష్ట్ర విశ్వవిద్యాలయాల వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యాడు. ఇప్పుడు డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతూ 2024-25లో రెండోసారి ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా అఖిల్, మధును వీబీఏ అసోసియేషన్ సభ్యులు, సీనియర్ వాలీబాల్ క్రీడాకారులు అభినందించారు.

రాష్ట్ర స్థాయి నృత్య ప్రదర్శన పోటీల్లో ప్రతిభ


బహుమతి అందుకుంటున్న నిత్యశ్రీ

జగిత్యాల, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి కూచిపూడి నృత్య ప్రదర్శన పోటీల్లో జగిత్యాల పట్టణానికి చెందిన మహదేవుని నిత్యశ్రీ, వింజమూరి శ్రీకృతి అనే చిన్నారులు ప్రతిభ కనబరిచి బహుమతులు అందుకున్నారు. హైద్రాబాద్‌లోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో గల ఎన్‌టీఆర్ కళామందిరంలో ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ సహకారంతో శివాని ఆర్ట్స్ అసోసియేషన్ 15వ వార్షికోత్సవం సందర్భంగా తెలంగాణ స్థాయి నృత్య, పద్యనాటక పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా శనివారం జరిగిన కూచిపూడి నృత్య పోటీల్లో జగిత్యాలకు చెందిన ఇరువురు చిన్నారులు పాల్గొని ప్రతిభ కనబరిచారు. చిన్నారులు మహదేవుని నిత్యశ్రీ, వింజమూరి శ్రీకృతిలకు నిర్వాహకులు పరమేశ్వర్ బహుమతులు అందించారు. కాగా ప్రతిభ కనబరిచిన చిన్నారులను ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డి, జగిత్యాల మోదిని లలిత కళాక్షేత్రం నాట్యాచార్యులు బొమ్మిడి నరేశ్ తదితరులు అభినందించారు.

ప్రమాదకరంగా ఎండిన వృక్షం

- భయపడుతున్న వాహనదారులు


సుద్దాల ప్రధాన రహదారి కూడలి వద్ద ఎండిన వృక్షం

కోనరావుపేట, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రధాన రహదారి ప్రధాన కూడలిలో రోడ్డుపై ఎండిన వృక్షం ప్రమాదకరంగా మారింది. దీంతో వాహన దారులు, గ్రామస్థులు భయాందోళన చెందుతన్నారు. కోనరావుపేట మండలం సుద్దాల గ్రామంలోని ప్రధాన రహదారి ప్రధాన కూడలిలో హరితహారం కార్యక్రమంలో భాగంగా పెట్టిన చెట్టు వృక్షంగా మారి ఎండిపోయింది. దీంతో ఎండిన వృక్షం తొలగించకపోవడంతో రోడ్డుపై ఎప్పుడు పడిపోతోందని వాహనదారులు, గ్రామస్థులు భయపడుతున్నారు. వృక్షం పడిపోయి ప్రమాదం జరగకముందే తొలగించాలని గ్రామస్థులు, వాహనదారులు కోరుతున్నారు.

దంపతులపై దాడి చేసి చోరీ

బీర్‌పూర్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రానికి చెందిన కాసం ఈశ్వరయ్య అనే వ్యాపారి ఇంట్లో శనివారం తెల్లవారుజామున నలుగురు గుర్తుతెలియని వ్యక్తులు ఈశ్వరయ్య దంపతులపై దాడి చేసి చోరీకి పాల్పడ్డారు. అతని భార్య ఒంటిపై ఉన్న మొత్తం 10 తులాల బంగారు నగలను, 10 తులాల వెండితో పాటు ఇంట్లో ఉన్న 10,000 వరకు నగదు ఎత్తుకెళ్లారు. సంఘటనా స్థలాన్ని డీఎస్పీ రఘుచందర్ పరిశీలించారు. డాగ్ స్క్వాడ్, క్లూస్ టీంతో ఆధారాలు సేకరించారు. బాధితుడు ఈశ్వరయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు బీర్‌పూర్ ఎస్సై కుమారస్వామి తెలిపారు. బాధితుడు ఈశ్వరయ్యను దొంగలు గాయపరచగా జగిత్యాలలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.

బేకరిపై మున్సిపల్ అధికారుల దాడులు

జగిత్యాల అర్బన్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) జగిత్యాల పట్టణంలోని కొత్త బస్టాండ్ ఔట్ గేట్ ఎదురుగా ఉన్న బాబాసాయి బేకరిపై శనివారం రాత్రి మున్సిపల్ అధికారులు దాడులు చేశారు. బేకరిలో బూజు పట్టిన కేకులు విక్రయిస్తున్నారని వినియోగదారులు ఇచ్చిన ఫిర్యాదుతో మున్సిపల్ అధికారులు దాడులు చేశారు. కుళ్లి పోయిన కోడిగుడ్లు, దుర్వాసనతో ఉన్న కేకులు, బేకరీలో వాడే ఇతర ఆహార పదార్థాలు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం బేకరీ యజమానికి నోటీసులు ఇచ్చారు.

శిథిలావస్థలో ఎస్సారెస్పీ డీ-86 ప్రధాన కాలువ

- కూలిన డ్రాప్‌లు.. కాలువకు గండ్లు
- నిధులు మంజూరైనా మరమ్మతు కరువు

ఎలిగేడు, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ భూములకు వరప్రదాయినిగా నిలిచిన శ్రీరాంసాగర్ ఆయకట్టు నీటిని అందించే డీ-86 ప్రధానకాలువ శిథిలావస్థకు చేరుకుంది. కాలువ మరమ్మ తులకు 49.80లక్షల రూపాయలు ప్రభుత్వం మంజూరు చేసినా పనులను చేపట్టేందుకు టెండర్లు పూర్తి కాలేదు. దీంతో చివరి ఆయకట్టుకు ఎస్సారెస్పీ నీరు అందే పరిస్థితి కనబడడంలేదని రైతులు వాపోతున్నారు.

డీ-86 ప్రధాన కాలువద్వారా పెద్దపల్లి నియోజకవర్గంలోని ఎలిగేడు, సుల్తానాబాద్, జూలపల్లి, ఓదెల, శ్రీరాంపూర్ మండలాల్లోని వేలాది ఎకరాల భూముల్లో పండే పంటలకు సాగునీరు అందిస్తోంది. ఈప్రాంత రైతులు ఎస్సారెస్పీ నీటిని ఆధారం చేసుకొని అధికశాతం వరిపంటను సాగు చేస్తున్నారు. సాగునీటిని అందించే ప్రధాన కాలువ శిథిలావస్థకు చేరుకొని రెండు దశాబ్దాలు దాటినప్పటికీ మరమ్మతులు చేయడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు.

డీ-86 ప్రధాన కాలువపై ఉన్న డ్రాప్‌లు నీటి ప్రవాహానికి కొట్టుకుపోయి, ఉపకాలువలకు వెళ్లే తూములు కూలిపోతు న్నాయి. మరోవైపు కాలువకు ఇరువైపులా గండ్లు పడి ప్రమాదకరంగా మారుతున్నాయి. అలాగే ఉపకాలువలు, పంట కాలువలు పిచ్చి మొక్కలతో నిండి ఉన్నాయి. దీంతో చివరి ఆయకట్ట భూములకు సాగునీరు అందడం లేదని రైతులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. ఈ కాలువల పరిస్థితి ఇలాగే ఉంటే రానున్న యాసంగి పంటలకు వారబందీ పద్ధతిలో సరఫరా చేస్తే పంటలకు అరకొరగా అందే అవకాశం ఉండదని రైతులు వాపోతున్నారు. లాలపల్లి, ఎదురుగట్ల నుంచి శివపల్లి వరకు డీ-86 ప్రధాన కాలువపై పెద్ద డ్రాపులు కూలిపోగా మరికొన్ని చోట్ల లోతైన మట్టి బుంగలు ఏర్పడ్డాయి. ఎప్పటికైన ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకొని వెంటనే కాలువలు, డ్రాపులు మరమ్మతులు చేయించాలని రైతులు కోరుతున్నారు.

కాలువల మరమ్మతు చేపట్టాలి



కాసర్ల మహేందర్, రైతు, నారాయణపల్లి

ఎస్సారెస్పీ డీ-86ప్రధాన కాలువపై కూలిపోయిన డ్రాపులు, ఏర్పడిన బుంగల మరమ్మతులను వెంటనే చేపట్టాలి. లేకుంటే యాసంగిలో రైతులకు చివరి పంట భూములకు సాగునీరు అందక ఇబ్బందులు తలెత్తుతాయి.

మరమ్మతులకు నిధులు మంజూరు



- ప్రసాద్, ఎస్సారెస్పీ ఈఈ

లాలపల్లినుంచి శివపల్లి వరకు ఉన్న ఎస్సారెస్పీ డీ-86 ప్రధాన కాలువ మరమ్మతులకు రూ.49.80లక్షలు నిధు లు ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ పనులను చేపట్టేందుకు టెండర్లు పూర్తి కాలేదు. త్వరగా పనులను చేపట్టేందుకు కృషి చేస్తాం.


శివపల్లిలో కూలిన ఎస్సారెస్పీ కాలువ డ్రాప్


తెగిన డీ-86 ప్రధాన కాలువ


కూలిన తూమ్

ఆయిల్‌పామ్ సాగుపై శిక్షణ

- రెబ్బల్‌దేవ్‌పల్లిలో 40 ఎకరాల్లో నర్సరీ
- ఎనిమిది లక్షల మొక్కల పెంపకం..
- అక్కడినుంచి జిల్లావ్యాప్తంగా పంపిణీ
- ఎస్సీలకు వంద, బీసీలకు తొంబై శాతం సబ్సిడీ
- నాలుగేళ్ల పాటు పెట్టుబడికి సాయం



రెబ్బల్‌దేవ్‌పల్లి నర్సరీలో పంపిణీకి సిద్ధంగా ఉన్న ఆయిల్‌పామ్ మొక్కలు

సుల్తానాబాద్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లాలో ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. దీంతో తక్కువ పెట్టుబడితో దీర్ఘకాలికంగా ఆదాయాన్నిచ్చే ఆయిల్‌పామ్ సాగు వైపు దృష్టి సారిస్తున్నారు. మరోవైపు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా రైతులకు సబ్సిడీ, పెట్టుబడి సాయం రూపంలో ప్రోత్సాహం అందిస్తున్నాయి. మూడేళ్ల క్రితం సుల్తానాబాద్ మండలం రెబ్బల్‌దేవ్‌పల్లిలో రాష్ట్ర ఉద్యానవన శాఖ వారి ఆధ్వర్యంలో తిరుమల కంపెనీకి చెందిన వారు ఆయిల్‌పామ్ నర్సరీని ఏర్పాటు చేశారు. ప్రభుత్వ యంత్రాంగం ద్వారా ఆయిల్‌పామ్ సాగుపై రైతులను చైతన్యపరిచే కార్యక్రమం చేపట్టారు. గ్రామగ్రామాన అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నారు. వ్యవసాయ, ఉద్యానవన శాఖ ఉన్నతాధికారులు, శాస్త్రవేత్తలను ఆహ్వానించి రైతుల్లో సందేహాలను నివృత్తి చేస్తున్నారు.

● 48 ఎకరాల్లో నర్సరీ..

రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఆయిల్ పామ్ నర్సరీలను ఏర్పాటు చేయాలన్న ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారులు రెబ్బల్‌దేవ్‌పల్లిలో నర్సరీని ఏర్పాటు చేశారు. గ్రామంలో 48 ఎకరాల విస్తీర్ణంలో ఆయిల్ పామ్ నర్సరీ ఏర్పాటు చేసి మొక్కలను విదేశాల నుంచి తెప్పించి వాటిని సంరక్షించారు. జిల్లాలో ఆయిల్ పామ్ సాగుపై ఆసక్తి కలిగిన రైతులను గుర్తించి వారిని నర్సరీకి తీసుకువచ్చి తగిన శిక్షణ ఇప్పిస్తున్నారు. రైతుల భూములను గుర్తించి వాటికి నీటి వసతి ఉందా లేదా, ఆయిల్‌పామ్ సాగుకు యోగ్యమైన భూములు అవునా కాదా అని విచారిస్తారు. అవసరమైన చోట భూసార పరీక్షలు చేయించి సాగు కోసం సన్నద్ధం చేయిస్తారు.

● మొక్కల సంరక్షణ..

రెబ్బల్‌దేవ్‌పల్లిలో 2021లో ఆయిల్‌పామ్ నర్సరీ ఏర్పాటు చేశారు. ప్రైమరీ నర్సరీలో మొదట మూడు నుంచి నాలుగు నెలల వరకు మొక్కలను పెంచుతారు. అనంతరం ఆ మొక్కలను అక్కడి నుంచి తొలగించి వాటిని ఇరవై కిలోల మట్టి కవర్లలో పెట్టి సెకండరీ నర్సరీకి తరలిస్తారు. అక్కడ 12 నుంచి 14 నెలలు సంరక్షించిన అనంతరం వాటిని రైతులకు పంపిణీకి యోగ్యంగా ఉన్నవా లేవా నిర్ధారిస్తారు. నర్సరీలో సంరక్షించిన ఆయిల్ పామ్ మొక్కలను జిల్లాలోని 14 మండలాలకు చెందిన రైతులకు పంపిణీ చేస్తున్నారు.



నీరుకుళ్లలో ఆయిల్‌పామ్ పంట సాగు చేస్తున్న రైతులు(ఫైల్)

పది వేల ఎకరాల్లో సాగు అంచనా..

జిల్లాలో పదివేల ఎకరాల్లో ఆయిల్ పామ్ రైతులతో సాగు చేయించాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటి వరకు జిల్లాలోని అంతర్గాం మండలంలో 80 ఎకరాల్లో, ధర్మారం మండలంలో 314, ఎలిగేడులో 137, జూలపల్లిలో 2016, కమాన్‌పూర్‌లో 105, మంథనిలో 242, ముత్తారంలో 458, ఓదెలలో 162, పాలకుర్తిలో 153, పెద్దపల్లిలో 166, రామగిరిలో 119, రామగుండంలో 61, కాల్వశ్రీరాంపూర్‌లో 151, సుల్తానాబాద్‌లో 252 ఎకరాలతో కలిపి మొత్తం 4416 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. వీరందరికీ తామే మొక్కలు పంపిణీ చేశామని రెబ్బల్‌దేవ్‌పల్లిలోని నర్సరీ నిర్వాహకులు తెలిపారు.

● రైతులకు సబ్సిడీ...

ఆయిల్ పామ్ సాగుపై ఆసక్తిగల ఎస్సీ రైతులకు వంద, బీసీలకు తొంబై శాతం చొప్పున సబ్సిడీ ఇస్తారు. అలాగే డ్రిప్ కోసం అవసరమైన పెట్టుబడి మొత్తాన్ని అందించి నాలుగేళ్ల అనంతరం వాయిదాల రూపంలో కంపెనీ వారు వసూలు చేసుకుంటారు. ఆయిల్‌పామ్ సాగు చేసే ఒక్కొక్క రైతుకు ఎకరాకు రూ.4200 చొప్పున పెట్టుబడులు చెల్లిస్తారు. ఇలా నాలుగేళ్లకు దాదాపు పదిహేడు వేల రూపాయల వరకు ప్రభుత్వం చెల్లిస్తుంది.

ఎకరాకు రూ.1,140 చెల్లిస్తే చాలు..

\- శివ, నర్సరీ మేనేజర్



ఆయిల్‌పామ్ సాగు చేసే రైతులు ఒక్కో మొక్కకు 20 రూపాయల చొప్పున ఎకరా సాగు కోసం 57 మొక్కలకు రూ.1140 చెల్లిస్తే సరిపోతుంది. ఆయిల్ పామ్ పంటలో రైతులు అంతర పంటలు కూడా వేసుకోవచ్చు. నాలుగేళ్లలో మొక్కజొన్న, వేరుశనగ, పత్తితో పాటు కూరగాయలను అంతర పంటగా సాగు చేసుకోవాలి. ఆయిల్ పామ్ సాగు చేసే రైతులకు 30 ఏళ్ల వరకు ఆదాయం వస్తుంది.

ఎయిర్‌ఫోర్స్‌కు సైనిక్ స్కూల్ విద్యార్థి ఎంపిక



సిద్ధార్థ

చొప్పదండి, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లా చొప్పదండి మండలంలోని రుక్మాపూర్ సాంఘిక సంక్షేమ గురుకుల సైనిక్ స్కూల్ విద్యార్థి రామడుగు సిద్ధార్థ ఎయిర్‌ఫోర్స్‌కు ఎంపికయ్యాడు. 12వ తరగతి పూర్తి చేసిన సిద్ధార్థ్ ఎన్డీఏ పరీక్షలో ప్రతిభ చాటి ఎయిర్‌ఫోర్స్ వింగ్‌కు ఎంపికయ్యాడు. కాగా సిద్ధార్థ్‌ను గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి అలుగు వర్షిణి, సంయుక్త కార్యదర్శి సక్రు నాయక్, జోనల్ ఆఫీసర్ భీమయ్య అభినందించారు. ఈ మేరకు ఎన్డీఏకు ఎంపికకు కృషి చేసిన పాఠశాల డైరెక్టర్ కల్నల్ కేసీ రావు, ప్రిన్సిపాల్ కాళహస్తి, సిబ్బందిని సంస్థ కార్యదర్శి అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో మాజీ ఎంపీటీసీ మృతి

గంగాధర, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో మాజీ ఎంపీటీసీ మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గంగాధర మండలం కురిక్యాలకు చెందిన మాజీ ఎంపీటీసీ నందయ్య(50) శనివారం మధురానగర్ చౌరస్తాకు బైక్‌పై పని నిమిత్తం వెళుతున్నాడు. ఇదే సమయంలో కొడిమ్యాల మండలానికి ఓ వ్యక్తి ద్విచక్రవాహనంపై కరీంనగర్ వైపు వస్తున్నాడు. మధురానగర్ చౌరస్తాలో రెండు వాహనాలు వేగంగా ఢీకొన్నాయి. కిందపడిన నందయ్యకు తీవ్రంగా గాయాలయ్యాయి. స్థానికులు 108లో కరీంనగర్‌కు తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు.

త్రీడీ ఆర్టిస్ట్‌ను అభినందించిన గవర్నర్

రామగిరి, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ త్రీడీ ఆర్టిస్ట్ ఎస్ఎస్ఆర్ కృష్ణను శనివారం గవర్నర్ జిష్ణుదేవ్ అభినందించారు. హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను కృష్ణ మర్యాదపూర్వకంగా కలిసి త్రీడీ ఆర్ట్ గురించి వివరించారు. వివిధ దేశాల్లో కృష్ణ గీసిన త్రీడీ చిత్రాలను ఆసక్తిగా గవర్నర్ పరిశీలించి కృష్ణను అభినందించారు. మహాభారత కాలంనాటి ఈ త్రీడీ ఆర్ట్‌ను అభివృద్ధి చేయాలని, రాజ్‌భవన్ స్కూల్‌లో త్రీడీ ఆర్ట్ అవగాహన వర్క్‌షాప్ నిర్వహించాలని గవర్నర్ సూచించారు.

నిఫ్ట్ కోర్సులతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు

\- మొదలైన ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లు - జనవరి 6 వరకు అవకాశం



మాట్లాడుతున్న ప్రొఫెసర్లు అనంతఫణి, రామకృష్ణ, నరేష్‌కుమార్

సుభాష్‌నగర్, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ (నిఫ్ట్) కోర్సులతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఉంటాయని, అడ్మిషన్ల కోసం ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లు ప్రారంభమైనట్లు ఇనిస్టిట్యూట్ ప్రొఫెసర్లు అనంతఫణి, రామకృష్ణ, నరేష్‌కుమార్ తెలిపారు. శనివారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు తెలియచేశారు. ఈ కోర్సులో అండర్ గ్రాడ్యుయేట్స్ కోర్సులలో ఫ్యాషన్ డిజైన్, టెక్స్‌టైల్ డిజైన్, యాక్సెరీ డిజైన్, నిట్‌వేర్ డిజైన్, లెదర్ డిజైన్, ఫ్యాషన్ కమ్యూనికేషన్, ఫ్యాషన్ టెక్నాలజీ ఉన్నాయని తెలిపారు. ఇంటర్మీడియట్ అర్హతతో ఇందులో చేరవచ్చన్నారు. డిగ్రీ, పీజీ చేసినవారు కూడా ఈ కోర్సులో చేరవచ్చన్నారు. ఎక్కువగా ఉత్తర భారతదేశానికి చెందిన వారే ఇందులో చేరుతుంటారని, దక్షిణ భారత్‌లో దీనిపై ఎవరూ దృష్టి పెట్టరని అన్నారు. 2025 విద్యా సంవత్సరానికి నవంబరు 20 నుంచే ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రారంభమైందని, 6 జనవరి 2025తో గడువు ముగుస్తుందని తెలిపారు. రూ. 5వేల ఫైన్‌తో జనవరి 7 నుంచి 9 వరకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు అవకాశం ఉందన్నారు. 9 ఫిబ్రవరి 2025లో ఎంట్రెన్స్ ఎగ్జామ్ ఉంటుందన్నారు. ఏప్రిల్ చివరిలో ఫలితాలు ప్రకటిస్తారని, జూన్ 2025లో సీట్ల కేటాయింపు ఉంటుందని వివరించారు. ఆసక్తిగల అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

బోర్డులో అన్ని కార్మిక సంఘాలకు అవకాశం ఇవ్వాలి

\- ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణ

గోదావరిఖని, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనాలు నిర్ణయించే బోర్డులో అన్ని కార్మిక సంఘాలకు అవకాశం ఇవ్వాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఐ కృష్ణ డిమాండ్ చేశారు. శనివారం గోదావరిఖనిలోని ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో దివంగత సీఎం రాజశేఖర్‌రెడ్డి హయాంలో కనీస వేతనాల మండలిని నియమించారన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో పట్టించుకోలేదన్నారు. మళ్లీ రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఏర్పడిన తరువాత వేతన మండలి చైర్మన్‌ను నియమించింది కానీ సభ్యులను నియమించకుండా కాలయాపన, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. కనీస వేతన సవరణ చట్టానికి అనుగుణంగా జీవోలను జారీ చేయాలని డిమాండ్ చేశారు. కేవలం ఐఎన్‌టీయూసీ, ఏఐటీయూసీలకు మాత్రమే స్థానం కల్పించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్టు తెలిపారు. విలేకరుల సమావేశంలో ఐఎఫ్‌టీయూ నాయకులు నరేష్, అశోక్, చిలుక శంకర్, దుర్గయ్య, రవికుమార్, సాంబయ్య, ప్రవీణ్‌కుమార్, నర్సయ్య పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఐ కృష్ణ

ఎంసీహెచ్‌లో శిశువు మృతి

\- అట్ట డబ్బాలో పెట్టి తండ్రికి అప్పగించిన సిబ్బంది -ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన వైనం



ఆస్పత్రి వద్ద రోదిస్తున్న తల్లి, బంధువులు, (ఇన్‌సెట్‌లో శిశువును అట్ట డబ్బాలో పెట్టి ఇచ్చిన సిబ్బంది)

జగిత్యాల అర్బన్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల మాతా శిశు కేంద్రంలో దారుణం చోటు చేసుకుంది. పుట్టినప్పుడు ఆరోగ్యంగా ఉన్న శిశువు రెండు రోజుల తర్వాత అకస్మాత్తుగా మృతి చెందాడు. వైద్యుల నిర్లక్ష్యంతో తన కుమారుడు మృతి చెందాడని శిశువు తండ్రి ఆరోపిస్తున్నాడు. ఆలస్యంగా ఈ సంఘటన వెలుగులోకి వచ్చింది. జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలం నగునూర్ లచ్చక్కపేటకు చెందిన కిషోర్-శ్రీలతలకు ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. మూడో సంతానంగా జగిత్యాలలోని మాతా శిశు కేంద్రంలో ఈనెల 10వ తేదీ మంగళవారం కుమారుడు జన్మించాడు. శిశువు పుట్టిన తర్వాత పరీక్షించిన వైద్యులు ఆరోగ్యంగా ఉన్నాడని చెప్పడంతో తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. భార్య వద్ద తన బంధువును ఉంచిన కిషోర్ పనికోసం బయటకు వెళ్లాడు. గురువారం సాయంత్రం ఆస్పత్రి నుంచి బాబు సీరియస్‌గా ఉన్నాడంటూ కిషోర్‌కు ఫోన్ రావడంతో హడావిడిగా మాతా శిశు కేంద్రానికి చేరుకున్నాడు. ఆయనకు బాబు మృతి చెందాడని ఆస్పత్రి సిబ్బంది తెలిపారు. అప్పటివరకు ఆరోగ్యంగా ఉన్న బాబు ఎలా మృతి చెందాడని ప్రశ్నిస్తే వైద్యులు ఒక్కొక్కరు ఒక్కోరకమైన సమాధానం చెప్పారని కిశోర్ ఆరోపిస్తున్నాడు. బాబుకు ఆస్పత్రి సిబ్బంది వ్యాక్సిన్ ఇచ్చారని, వ్యాక్సిన్ ఇచ్చిన తర్వాతనే మృతి చెందాడని అతను ఆరోపిస్తున్నారు. మృత శిశువును తన చేతికి అప్పగించారని, తర్వాత కాటన్ డబ్బాలో శిశువును పెట్టి హడావిడిగా అక్కడి నుంచి పంపించారని ఆరోపించాడు. శిశువు మృతి చెందిన విషయమై ఆస్పత్రి సూపరింటెండెంట్ రాములను వివరణ కోరగా బాబు ఆరోగ్యంగా జన్మించాడని, ఎలాంటి అనారోగ్య సమస్యలు లేవని, పాలు సరిగా పట్టకపోవడం వల్ల పాలు ముక్కులోకి వెళ్లి శ్వాస అందక మృతి చెందాడని ఆయన వివరణ ఇచ్చారు.

వైభవంగా అయ్యప్ప పడి పూజ



రాజన్న ఆలయంలో ప్రదక్షిణ చేస్తున్న నిర్వాహకులు, అర్చకులు



కోరుట్లలో కర్పూర హారతులు అందిస్తున్న స్వాములు

కోరుట్ల రూరల్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సంగెం గ్రామంలోని సంగమేశ్వర ఆలయంలో శనివారం అయ్యప్ప పడి పూజ మహోత్సవం వైభవంగా జరిగింది. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన వేదపండితుడు పాలెపు రామకృష్ణ శర్మ మంత్రోచ్చారణల మధ్య పడి పూజ మహోత్సవం నిర్వహించారు. గురుస్వామి సుద వేణి భూమయ్య ఆధ్వర్యంలో 18వ సారీ దీక్ష భూనిన శంకర్ పడి పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. గణపతి, సుబ్రహ్మణ్య, అయ్యప్ప ఉత్సవ విగ్రహాలకు పంచామృత అభిషేకం నిర్వహించారు. అనంతరం అయ్యప్ప స్వాములు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు కాంగ్రెస్ నాయకులతో కలిసి ప్రత్యేక పూజలలో పాల్గొన్నారు.

- వైభవంగా ఆరట్టు ఉత్సవం

వేములవాడ కల్చరల్: వేములవాడ మున్సిపల్ పరిధిలోని తిప్పాపూర్ అయ్యప్ప ఆలయంలో శనివారం ఆరట్టు ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం ఒంటి గంటకు రాజరాజేశ్వరస్వామి ఆలయంలోని ధర్మగుండంలో చక్రస్నానం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. సాయంత్రం 6.30 గంటలకు ఆలయంలో పడిపూజ నిర్వహించారు. ఆలయ చైర్మన్ కొండ దేవయ్యపాల్గొన్నారు.

- ఆరట్టు ఉత్సవంలో ప్రభుత్వ విప్

వేములవాడ మున్సిపల్ పరిధిలోని అయ్యప్ప స్వామి ఆలయంలో నిర్వహించిన ఆరట్టు ఉత్సవానికి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఆయన వెంట మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కనికరపు రాకేష్ తదితరులు ఉన్నారు.

భక్తజన సంద్రంగా రాజన్న క్షేత్రం



రాజన్నను దర్శించుకుంటున్న భక్తులు

వేములవాడ కల్చరల్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయం శనివారం భక్తజన సంద్రంగా మారింది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు రాజన్న ఆలయానికి చేరుకుని ఆలయ వసతిగదుల్లో విడిది చేశారు. తెల్లవారు జామున కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించిన భక్తులు ధర్మగుండంలో పవిత్రస్నానాలను ఆచరించారు. క్యూలైన్‌ల ద్వారా ఆలయంలోకి ప్రవేశించిన భక్తులు పార్వతిపరమేశ్వరులను దర్శించుకున్నారు. రాజన్నకు ఎంతో ప్రీతిపాత్రమైన కోడెమొక్కు చెల్లించుకున్నారు. అనుబంధ ఆలయాల్లో కుంకుమ పూజలో పాల్గొన్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ సూపరింటెండెంట్ తిరుపతిరావు, పీఆర్వో అశోక్, ఎడ్ల శివసాయిలు ఏర్పాట్లు చేశారు.

రాజన్నను దర్శించుకున్న మితాలి మధుస్మిత

వేములవాడ రాజరాజేశ్వరస్వామిని ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల ఇన్‌కమ్‌టాక్స్ ఐఆర్ఎస్ ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్ మితాలి మధుస్మిత శనివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయాధికారులు ఘన స్వాగతం పలికారు. రాజన్న ప్రత్యేక పూజలో పాల్గొన్న అనంతరం నాగిరెడ్డి మండపంలో అర్చకులు ఆశీర్వచనం, ఆలయ సూపరింటెండెంట్ తిరుపతిరావు రాజన్న ప్రసాదాన్ని అందజేశారు.

ఘనంగా దత్తాత్రేయ స్వామి జయంతి



అలంకరణలో స్వామివారు

ధర్మపురి, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో దత్తాత్రేయ స్వామి జయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ నెల 8 నుంచి ఆరంభమైన దత్తాత్రేయ స్వామి నవరాత్రోత్సవాల్లో భాగంగా పౌర్ణమి రోజున ఉదయం స్థానిక లక్ష్మీ నరసింహ స్వామి అనుబంధ రామలింగేశ్వర స్వామి ఆలయం పక్కనే గల ఆలయంలో, గోదావరి నదీ తీరాన గల ఆలయంలో దత్తాత్రేయ స్వామి వారలను అందంగా పూలతో అలకరించారు. అనంతరం ఆలయ అభిషేక్ పౌరోహితులు బొజ్జ రాజగోపాల్‌శర్మ, ద్యారం గురుప్రసాద్ ఆధ్వర్యంలో వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య స్వామి వారలకు రుద్రాభిషేకం, పురుషసూక్తం, విశేష పూజలు జరిపారు. పౌర్ణమి సందర్భంగా లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయంలో అనేక మంది భక్తులు స్వామి వారలను దర్శనం చేసుకుని మొక్కులు చెల్లించుకున్నారు. గోదావరి నదీ తీరాన గల ఆలయంలో రాత్రి వేళలో మంత్ర జాగరణ, ప్రత్యేక పూజలు, హారతి, తీర్థ, ప్రసాద వితరణ జరిపారు. అలాగే దివ్యదర్శనం, బాల దత్తాత్రి డోలోత్సవం జరిపారు. కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, రొట్టె శ్రీనివాస్ పాల్గొన్నారు. ధర్మపురి క్షేత్రంలోని గోదావరి నదీ తీరాన గల శ్రీ దత్తాత్రేయ స్వామి ఆలయంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ శనివారం పూజలు నిర్వహించారు.

అంజన్న సన్నిధిలో భక్తుల సందడి

మల్యాల, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయ స్వామి సన్నిదానం శనివారం వేలాది భక్తులతో సందడిగా మారింది. వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా వచ్చిన భక్తులు అంజన్నను దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో అభిషేకాలు, ఇతర పూజలు జరిపారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ అధికారులు పర్యవేక్షించారు

● రేపటి నుంచి ధనుర్మాస ఉత్సవాలు

కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయంలో గల ఉప ఆలయం వెంకటేశ్వరస్వామి సన్నిధిలో సోమవారం నుంచి నెల రోజుల పాటు ధనుర్మాస ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో రామకృష్ణరావు తెలిపారు. ఈ సందర్భంగా నిత్యం ఆండాల్ అమ్మవారికి పంచామృత అభిషేకం, తిరుప్పావై అనుసంధానం, పొంగలి నివేదన, భజన కార్యక్రమాలు ఉంటాయని వివరించారు. ఇందులో భాగంగా జనవరి 10న వైకుంఠ ఏకాదశి, ఉత్తర ద్వారా దర్శనం, 13న గోదా రంగనాథ కళ్యాణ ఉత్సవాలు జరుగుతాయని అన్నారు. భక్తులు అధిక సంఖ్యలో ఈ ఉత్సవాలలో పాల్గొనాలని కోరారు

ఉమ్మడి జిల్లా షూటింగ్ బాల్ పోటీలకు స్పందన



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన ఉమ్మడి జిల్లా క్రీడాకారులు

కరీంనగర్ స్పోర్ట్స్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లా యునైటెడ్ షూటింగ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఉమ్మడి జిల్లా షూటింగ్‌బాల్ జట్ల ఎంపిక పోటీలకు స్పందన లభించింది. జిల్లా కేంద్రంలోని సప్తగిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఈ పోటీలకు ఉమ్మడి జిల్లాలోని కరీంనగర్, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, జగిత్యాల జిల్లాల్లోని వివిధ ప్రాంతాల నుంచి 160 మంది క్రీడాకారులు పాల్గొని ప్రతిభచాటారు. ఈ పోటీల్లో విశేష ప్రతిభచాటిన క్రీడాకారులను ఈ నెల 22 నుంచి 25వ తేదీ వరకు నల్గొండ జిల్లాలో నిర్వహించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే ఉమ్మడి జిల్లా జట్టుకు ఎంపిక చేశారు. ఈ పోటీలను ఉమ్మడి జిల్లా షూటింగ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సయ్యద్ ఆరిఫ్ పాషా, మహ్మద్ ముఫాజిల్ అహ్మద్ పర్యవేక్షించారు. పోటీల నిర్వహణలో వ్యాయామ ఉపాధ్యాయులు, ఆశాలు కుమార్, నాగరాజు, సీనియర్ క్రీడాకారులు ఆదిత్య, నరేశ్, వంశీ, అద్నాన్, సబిక్ పాల్గొన్నారు.

స్నేహితుడని నమ్మితే నట్టేట ముంచాడు

\- 15 మంది క్రెడిట్ కార్డులు స్వైప్ చేసి ఉడాయించిన యువకుడు

\- పోలీసులను ఆశ్రయించిన బాధితులు

జగిత్యాల అర్బన్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): స్నేహితుడని నమ్మిన వ్యక్తి కుటుంబ సభ్యులు అనారోగ్యంతో ఉన్నారని చెప్పి ఒకరికి తెలియకుండా ఒకరి వద్ద క్రెడిట్ కార్డులు తీసుకుని 40 లక్షలతో ఉడాయించాడు. ఈ సంఘటన జగిత్యాల జిల్లా కేంద్రంలో జరగగా బాధితులు శనివారం పోలీసులను ఆశ్రయించారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. జగిత్యాల జాంబాగ్‌కు చెందిన కల్లెం యశ్వంత్ ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. తన తల్లి, భార్య అనారోగ్యం పేరు చెప్పి ఒకరికి తెలియకుండా ఒకరి వద్ద 15 మంది క్రెడిట్ కార్డులు తీసుకుని 40 లక్షల రూపాయలు స్వైప్ చేశాడు. ఆ డబ్బులు తీసుకుని ఉడాయించాడు. క్రెడిట్ కార్డులు లేని వారికి క్రెడిట్ కార్డులు ఇప్పించి మరీ మోసగించాడని బాధితులు వాపోయారు. దీంతో బాధితులు శనివారం అతని ఇంటి ఎదుట బైఠాయించారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి బాధితులతో మాట్లాడారు. అనంతరం బాధితులు జగిత్యాల పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రెండు నెలల నుంచి పరారీలో ఉన్న యశ్వంత్‌ను పట్టుకుని తమకు న్యాయం చేయాలని పోలీసులను కోరారు.

న్యూస్ బాక్స్

కస్తూర్బా పాఠశాల తనిఖీ

రామగిరి, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పన్నూరు గ్రామంలోని కస్తూర్బా పాఠశాలను శనివారం ఎంపీడీవో శైలజారాణి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు ప్రదీప్‌లో ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న ఫుడ్ మెనూ పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనం వివరాలను అడిగి తెలుసుకున్నారు. స్కూల్‌లోని డైనింగ్ హాల్, కూరగాయలను పరిశీలించారు. ప్రతిఒక్క విద్యార్థి పరిశుభ్రత పాటించాలని సూచించారు.

సామాజిక సేవలకు గుర్తింపు

సుల్తానాబాద్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : సామాజిక సేవలకు గుర్తింపుగా మండలంలోని ఐతరాజుపల్లి గ్రామానికి చెందిన డీకొండ భూమేష్‌కు జాతీయ స్థాయి అవార్డు దక్కింది. భూమేష్ తన తండ్రి పేరిట పలు సామాజిక సేవలు నిర్వహించాడు. గ్రామాలకు వైకుంఠ రథాలను బహుకరించాడు. ఈ సేవలను గుర్తించిన బహుజన సాహిత్య అకాడమీ నేషనల్ కమిటీ వారు హైదరాబాద్ రవీంద్ర భారతిలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో భూమేష్‌కు బెస్ట్ సర్వీసెస్ సొసైటీ నేషన్ అవార్డును అందజేశారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ

కాల్వశ్రీరాంపూర్, డిసెంబర్ 14 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని పాండవుల గుట్ట ప్రాంతంలో అయ్యప్ప సేవా సంఘం ఆధ్వర్యంలో అయ్యప్ప ఆలయం నిర్మాణానికి శనివారం భూమిపూజ నిర్వహించారు. 16న అయ్యప్ప ఆలయం నిర్మించే స్థలంలో అయ్యప్ప సేవా సంఘం ఆధ్వర్యంలో పడి పూజ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా క్రిస్మస్ క్యారల్స్

మంథని, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక సీయోను ప్రార్థన మందిరం ఆధ్వర్యంలో క్రిస్మస్ క్యారల్స్‌ను ఘనంగా ప్రారంభమయ్యాయి. మండలంలోని ఆరెంద, మల్లారం, శాస్త్రులపల్లి గ్రామాల్లో శనివారం క్యారెల్స్‌ను ప్రారంభించారు. ఈసందర్భంగా క్రిస్మస్ కేక్స్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఏసుక్రీస్తు జన్మ ప్రాముఖ్యతను విశ్వాసులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఐఎంఏ ప్రధాన కార్యదర్శి అంకరి కుమార్, పాస్టర్లు వల్లూరి ప్రభాకర్, దూడ మహేస్, మంథని మార్క్, రాజేష్, సంఘ పెద్దలు జోసఫ్, ప్రసాద్, రమేష్, కుమార్, నాగరాజులు పాల్గొన్నారు.

నియామకం

సుల్తానాబాద్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : ధర్మసమాజ్ పార్టీ సుల్తానాబాద్ మండల, మున్సిపల్ శాఖల అధ్యక్షులను నియమించినట్టు ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు కనకం గణేష్ ఒక ప్రకటనలో తెలిపారు. సుల్తానాబాద్ మండల శాఖ అధ్యక్షులుగా రామునిపల్లి గ్రామానికి చెందిన ఆవునూరి సతీష్‌ను, సుల్తానాబద్ పట్టణ అధ్యక్షులుగా ఆశాడం ముఖేష్‌లను నియమించినట్టు పేర్కొన్నారు. తమ నియామకానికి కృషి చేసిన రాష్ట్రజిల్లా సతీష్, ముఖేష్‌లు నాయకులకు కృత జ్ఞతలు తెలిపారు.

ప్రభుత్వ స్థలంలో నిర్మించిన చర్చిని తొలగించాలి

కాల్వశ్రీరాంపూర్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : పెగడపల్లిలో ప్రభుత్వ స్థలంలో అక్రమంగా నిర్మించిన చర్చిని తొలంగించాలని హిందువాహిని నాయకులు శనివారం ఎమ్మెల్యే విజయరమణారావుకు మండల కేంద్రంలో వినతిపత్రం అందజేశారు. హిందూ వాహిని జిల్లా సహాయ సంయోజక్ ఉయ్యంకార్ సాయికుమార్, బీజేపీ మండల అధ్యక్షుడు చిలువేరు సంపత్‌కుమార్, వేల్పుల రమేష్, పిల్లల మర్రి రాములు, పోగుల శ్రీనివాస్, శతల్ల కుమార్, దాత రాకేష్, శ్యాంసుందర్, కృష్ణ తదితరులు ఉన్నారు.

గురుకులాలపై తల్లిదండ్రులకు నమ్మకం కలిగించాలి

- పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున మంథని మున్సిపల్ చైర్‌పర్సన్ రమ

సుల్తానాబాద్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల తల్లిదండ్రులకు నమ్మకం కలిగించేలా గురుకుల విద్యాలయాల్లో చర్యలు తీసుకోవాలని పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. మండలంలోని గర్రెపల్లి సాంఘిక సంక్షేమ శాఖ బాలికల గురుకుల విద్యాలయంలో, భూపతిపూర్‌లోని జ్యోతిబా పూలే బీసీ గురుకుల విద్యాలయంలో జరిగిన కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. అక్కడి మధ్యాహ్న భోజన కార్యక్రమాన్ని పరిశీలిస్తూ వారితో కలిసి భోజనం చేశారు. సోషల్ వెల్ఫేర్ గురుకుల విదాలయంలో ఏర్పాటు చేసిన కామన్ డైట్ ప్రోగ్రామ్‌ను, పెంచిన మెస్ చార్జీలకు అనుగుణంగా రూపొందించి కొత్త డైట్ మెనూను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆర్థికంగా ఇబ్బందులున్నా డైట్ చార్జీలను గణనీయంగా పెంచి కొత్త డైట్ మెనూను ప్రవేశపెట్టామన్నారు. ప్రభుత్వం తమ కోసం ఉందనే నమ్మకం చదివే పిల్లలకు వారి తల్లిదండ్రులకు కల్పించాలనే ఉద్దేశ్యంతో ఇవన్నీ ప్రవేశపెట్టామని, పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకుని విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు అంతటి అన్నయ్యగౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ మినుపాల ప్రకాశ్‌రావు, తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి, ఎంపీడీవో దివ్య దర్శన్‌రావు, సత్యనారాయణరావు, పులి వెంకటేశం, లక్ష్మణ్, కల్లెపల్లి జానీ, చక్రపాణి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కాగా, ప్రభుత్వ రెసిడెన్షియల్ గురుకుల విద్యాలయాల్లో పరిశుభ్రతకు లోటు రాకుండా చర్యలు తీసుకోవాలని ఎప్పటికప్పుడు ఉపాధ్యాయులు శ్రద్ధ చూపాలని జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు అంతటి అన్నయ్య గౌడ్ అన్నారు. శనివారం సుల్తానాబాద్ పట్టణంలోని రెసిడెన్షియల్ బాలికల గురుకుల పాఠశాలను సందర్శించి అక్కడ ఏర్పాటుచేసిన నూతన డైట్ మెనూ ప్రారంభించారు. మార్కెట్ చైర్మన్ మినుపాల ప్రకాష్‌రావు, గురుకుల పాఠశాలల రీజనల్ కోఆర్డినేటర్ అంజలి, ప్రిన్సిపాల్ గిరిజ తదితరులు పాల్గొన్నారు.

● కోల్‌సిటీటౌన్ (ఆంధ్రజ్యోతి): గోదావరిఖనిలోని రామగుండం మహాత్మా జ్యోతిబాపూలే బీసీ బాలికల గురుకుల పాఠశాల, మహాత్మా జ్యోతిబాపూలే బీసీ బాలుర గురుకుల పాఠశాల, తెలంగాణ మైనార్టీ గురుకుల పాఠశాలల్లో కామన్ డైమస్ డైట్‌మెనూ కార్యక్రమం శనివారం ప్రారంభమైంది. స్థానిక సప్తగిరికాలనీలోని మహాత్మా జ్యోతిబా పూలే బాలికల గురుకుల పాఠశాలలో జరిగిన కార్యక్రమానికి రామగుండం కార్పొరేషన్ ఫ్లోర్‌లీడర్ మహంకాళి స్వామి హాజరై కామన్ డైట్‌మెనూ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే స్థానిక సప్తగిరికాలనీలోని తెలంగాణ మైనార్టీ గురుకుల పాఠశాలలో కామన్ డైట్‌మెనూ కార్యక్రమం ప్రారంభమైంది. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ గుల్బం శ్రీధర్ విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ చీఫ్ ఎగ్జిక్యూటీవ్ ఆఫీసర్ కె.నరేందర్, మైనార్టీ కాంగ్రెస్ నాయకులు ఎండీ ఆసిఫ్, ఎండీ అబిద్, టీమ్రిస్ కౌన్సిలర్ ఇస్మాయిల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



గోదావరిఖనిలోని బీసీ బాలికల గురుకుల పాఠశాలలో మాట్లాడుతున్న ఫ్లోర్ లీడర్ మహంకాళిస్వామి

● మంథని (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు స్థానిక ప్రభుత్వ హాస్టళ్లను, సాంఘిక, మైనార్టీ, ఎస్టీ గురుకుల కళాశాలలను అడిషనల్ కలెక్టర్ వేణు, మంథని మున్సిపల్ చైర్‌పర్సన్ పెండ్రి రమ-సురేష్‌రెడ్డి, ఏడీఏ అంజనీ, అధికారులు శనివారం సందర్శించారు. మెస్ పరిసరాలను, మెను అమలును పరిశీలించారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్నం భోజనం చేశారు. అనంతరం ప్రభుత్వం పెంచిన డైట్ నూతన రేట్లను వారు అవిష్కరించారు. అధికారులు, కౌన్సిలర్లు, ప్రిన్సిపాల్‌లు, విద్యార్థులు పాల్గొన్నారు.

● ధర్మారం (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మల్లాపూర్ బాలికల గురుకుల పాఠశాలను కలెక్టర్ కోయ శ్రీహర్షతో కలిసి ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పరిశీలించారు. అనంతరం విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో కలిసి సహపంక్తి వారు భోజనం చేశారు. ఈ సందర్భంగా అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెడుతోందని తెలిపారు. విద్యార్థులు ఒక లక్ష్యం పెట్టుకొని కష్టపడి చదివి ఉన్నత స్థానానికి చేరుకోవాలని ఆశాభావం వ్యక్తం చేశారు. మండల ప్రత్యేల అధికారి వీరబుచ్చయ్య, తహసీల్దార్ ఆరీఫ్‌ఉద్దీన్, ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, ప్రిన్సిపాల్ దేవసేన, పేరెంట్స్ కమిటీ చైర్మెన్ సాతరాజుల సుమన్, ఏఎంసీ చైర్మన్ లావుడ్యా రూప్లా నాయక్, ఏఎంసీ మాజీ చైర్మన్ నర్సింహులు, ఏఎంసీ డైరెక్టర్లు గంధం మహిపాల్, అరిగె లింగాయ్య, తిరుపతిరెడ్డి ఉన్నారు.

ఐకేపీలో అవకతవకలపై మంత్రి బాధ్యత వహించాలి

- మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సత్యనారాయణగౌడ్

రామగిరి, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నాగేపల్లి ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రంలో జరిగిన అవకతవకలపై మంత్రి శ్రీధర్‌బాబే బాధ్యత వహించాలని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పూదరి సత్యనారాయణ గౌడ్ డిమాండ్ చేశారు. శనివారం ఐకేపీ కొనుగోలు కేంద్రంలో బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి జరిగిన అవకతవకలకు సంబంధించిన ట్రక్ షీట్లను, వే బిల్లులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడారు. కొనుగోలు కేంద్రంలో ఉన్న కాంటాను ట్యాంపరింగ్ చేసి ఒక్కో బస్తాకు కిలో ఆరు వందల గ్రాముల వడ్లను దోచుకుంటున్నట్లు శుక్రవారం నిర్ధారణ అయినా ఇప్పటివరకు చర్యలు చేపట్టలేదన్నారు. రైతులు నేరుగా దొంగతనాన్ని బయట పెట్టినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. సీసీ తెచ్చిన వేబిల్లులో ఒక్కో లారీకి సుమారు ఆరు క్వింటాల్లు తేడా ఉన్నట్లు నిర్ధారణ జరిగిందని, మొత్తం వే బిల్లులు మాయంచేశారని ఆరోపించారు. శంకేషీరవీందర్, మ్యాదరవేని కుమార్‌యాదవ్, కొండవేన ఓదెలుయాదవ్, గాజుల ప్రసాద్, ప్రభాకర్, సుధాకర్, కాపురవేన భాస్కర్, బుర్రశంకర్‌గౌడ్, దామోరశ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి గురించి మాట్లాడే నైతిక హక్కు లేదు

మంథని, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో అభివృద్ధి పనుల గురించి మాట్లాడే నైతిక హక్కు మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు లేదని కాంగ్రెస్ నేతలు అయిలి ప్రసాద్, వొడ్నాల శ్రీనివాస్, కొత్త శ్రీనివాస్, ఎరుకల ప్రవీణ్, మంథని సత్యంలు అన్నారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. భూపాలపల్లి రోడ్డు, ఓడేడ్ వంతెన గురించి ఇప్పుడు మాట్లాడుతున్నారని, బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న 10ఏళ్లలో ఎందుకు పూర్తి చేయలేకపోయారని ప్రశ్నించారు. బీసీ నేతగా బీసీలకు ఏం అభివృద్ధి చేశావన్నారు. తమ నేత శ్రీధర్‌బాబు మంథని నియోజకవర్గ అభివృద్ధిపై ఒక విజన్ ఉన్న నాయకుడని, ప్రణాళికాబద్ధంగా నియోజకవర్గాన్ని సమగ్రంగా అభివృద్ధి చేస్తున్నారన్నారు. మంత్రి శ్రీధర్‌బాబుపై మరోసారి ఇలాంటి అసత్య ఆరోపణలు చేస్తే సహించేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు కుడుదుల వెంకన్న, జనగామ నర్సింగరావు, ఐలి శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

అమల్లోకి పెరిగిన చార్జీలు..

(5వ పేజీ తరువాయి)

రూపాయలు, 8 నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు 1100 రూపాయలు, ఇంటర్, డిగ్రీ, ఆపై చదువులు చదువుతున్న విద్యార్థులకు నెలకు 1500 రూపాయలు అందజేశారు. ఈ చార్జీలను 25 శాతానికి పెంచుతామని ప్రకటించారు. ఆ మేరకు 3 నుంచి 7వ తరగతి చదువుతున్న విద్యార్థులకు 1200 రూపాయలు, 8 నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు 1400 రూపాయలు, ఇంటర్, డిగ్రీ, ఆపై చదువులు చదువుతున్న విద్యార్థులకు నెలకు 1875 రూపాయలు అందజేస్తామని ప్రకటించింది. కానీ అమల్లోకి తీసుకరాలేదు. ఈ విషయమై విద్యార్థి సంఘాల నాయకులు ఎన్నో పోరాటాలు చేశారు. ఎట్టకేలకు ప్రస్తుత ప్రభుత్వం 40 శాతం చార్జీలను పెంచింది. ఆ చార్జీలను శనివారం నుంచి అమల్లోకి తీసుకవచ్చారు. జిల్లాలో సాంఘిక సంక్షేమ గురుకులాల సొసైటీ ఆధ్వర్యంలో 8 గురుకులాలు, ఒక మినీ గురుకుల పాఠశాల నడుస్తున్నది. వీటిలో దాదాపు 5,600 మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు. మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకులాలు 7 నడుస్తుండగా, వీటిలో 3,080 మంది విద్యార్థులు చదువుతున్నారు. మైనార్టీ గురుకుల విద్యాలయాలు 3 ఉండగా, వీటిలో 1054 మంది విద్యార్థులు చదువుతున్నారు. తెలంగాణ రెసిడెన్షియల్ స్కూళ్లు రెండు ఉండగా వాటిలో 680 మంది చదువుతున్నారు. ఇవేగాకుండా ఎస్సీ బాల, బాలికల హాస్టళ్లు 11 ఉండగా, వీటిలో 630 మంది వరకు విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు. కళాశాల వసతిగృహాలు ఆరు నడుస్తుండగా, వీటిలో 520 మంది వరకు విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు. బీసీ వసతి గృహాలు 6 ఉండగా వీటిలో 439 మంది విద్యార్థులు, కళాశాల స్థాయి వసతి గృహాలు 8 ఉండగా 770 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. పెంచిన చార్జీలతో ఇక నుంచి విద్యార్థులకు నాణ్యమైన, పౌష్టికాహారం అందనున్నది.

పెంచిన చార్జీలతో పౌష్టికాహారం అందనున్నది..

- సంజన, ఇంటర్ విద్యార్థి, గర్రెపల్లి గురుకుల పాఠశాల



మెస్ చార్జీలు, కాస్మెటిక్ చార్జీలు పెంచడం వల్ల ఇక నుంచి మాకు పౌష్టికాహారం అందనున్నది. గత ఏడాదే పెంచినట్లు ప్రకటించారు. కానీ చార్జీలు పెరగలేదు. ప్రస్తుతం గురుకులాలపై చొరవ చూపుతున్నది. 40 శాతం మెస్ చార్జీలు, 200 శాతం వరకు కాస్మెటిక్ చార్జీలు పెంచడం వల్ల మాకు మరింత ప్రయోజనం చేకూరనున్నది. చాలా ఆనందంగా ఉంది.

మంచి ఫలితాలు సాధిస్తాం..

- సుదీప, 9వ తరగతి, గర్రెపల్లి గురుకుల పాఠశాల



రాష్ట్ర ప్రభుత్వం పెంచిన చార్జీలతో మాకు మేలు జరగనున్నది. మెస్ చార్జీలు ఎప్పుడు పెంచుతారా అని ఎదురుచూశాం. కాస్మెటిక్ చార్జీలు కూడా ప్రస్తుతం మార్కెట్‌లో ఉన్న ధరలకు అనుగుణంగా పెంచారు. కొత్తగా రూపొందించిన మెనూ కూడా బాగా ఉంది. ఇక నుంచి బాగా చదువుకుని మెరుగైన ఫలితాలను సాధిస్తాం.

చార్జీలు పెంచడం సంతోషం..

- వి విజ్ఞాన్, పదో తరగతి, జ్యోతిబా పూలే బీసీ గురుకులం, గోదావరిఖని



చార్జీలు పెంచడం సంతోషంగా ఉంది. గతంలో తక్కువ చార్జీలు ఉండడం వల్ల ఇబ్బంది పడ్డాం. గతంలో పెంచినట్లే పెంచి అమలు చేయలేదు. చార్జీలు పెంచాలని వినతి పత్రాలు ఇచ్చాం. ఈ ప్రభుత్వం పెంచిన చార్జీలు శనివారం నుంచి అమల్లోకి తీసుకవచ్చింది. అలాగే కొత్త మెనూ కూడా బాగుంది.

గతంలో కాస్మెటిక్ చార్జీలు సరిపోయేవి కావు..

- అబ్దుల్ జునైద్, 9వ తరగతి, మైనార్టీ గురుకులం గోదావరిఖని



చాలా రోజుల తర్వాత మెస్‌చార్జీలు, కాస్మెటిక్ చార్జీలు పెంచడం సంతోషంగా ఉంది. చార్జీలు పెంచని కారణంగా మెను సక్రమంగా అమలుకాలేదు. చార్జీలను 40 శాతం పెంచడం వల్ల పౌష్టికాహారం అందనున్నది. గతం లో ఇచ్చే కాస్మెటిక్ చార్జీలతో కటింగ్ చేసుకోవడానికి, సబ్బులకు అందరికీ 62 రూపాయలే ఇచ్చేవాళ్లు. అవి సరిపోక ఇంటి నుంచి డబ్బులు తెచ్చుకునే వాళ్లం. ఇప్పుడు 200 రూపాయలకు పెంచారు.

హాస్టళ్లలో సమస్యల పరిష్కారానికి కృషి

కాల్వశ్రీరాంపూర్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర హాస్టల్, కస్తూరిబా బాలికల హాస్టల్, మల్యాల గ్రామ పరిధిలోగల మోడల్ స్కూల్ బాలకల హాస్టల్‌ను శనివారం తహసీల్దార్ ఎండి.వకీల్‌తో కలిసి మాజీ ఎంపీపీ గోపగోని సారయ్య గౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా సారయ్యగౌడ్ మాట్లాడుతూ ప్రభుత్వ హాస్టళ్లలో డైట్ చార్జీలు పెంచిన సందర్భంగా హాస్టల్స్ పరిశీలిస్తున్నామన్నారు. కస్తూరిబా పాఠశాలలో తాగునీటి సమస్యను ఎమ్మెల్యేకు వివరించి బోర్‌వెల్ వేయించనున్నట్లు తెలిపారు. హాస్టల్లోని మెనూ అమలుపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నట్లు తెలిపారు. గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉండగా హాస్టల్స్‌ను పట్టించుకోలేదన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ గర్రెపల్లి శంకర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గాజనవేన సదయ్య, మాజీ జడ్పీటీసీ లంక సదయ్య, సింగిల్‌విండో వైస్ చైర్మన్ సబ్బని రాజమల్లు, నాయకులు ఎనగంటి రవి, మాదాసు సతీష్, శివరామకృష్ణ, మేడి అశోక్‌గౌడ్, శ్రవణ్‌కుమార్, హాస్టల్ వార్డెన్ సత్యనారాయణ, కస్తూర్బా ప్రిన్సిపాల్ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.



వంటలను పరిశీలిస్తున్న అధికారులు, నాయకులు

వైభవంగా దత్తాత్రేయ స్వామి జయంత్యుత్సవం..

మంథని, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మంథని శ్రీదత్తాత్రేయ స్వామి ఆలయంలో జయంతి వేడుకలను భక్తులు శనివారం వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామునే గర్భాలయంలోని స్వామివారి మూలవిరాట్, ఉత్సవ మూర్తులకు వేద మంత్రోచ్ఛరణలతో ప్రత్యేక అర్చనలు, అభిషేకాలను పండితులు నిర్వహించారు. అనంతరం స్వామి వారిని వివిధ రకాల పుష్పాలు, స్వర్ణాభరణాలు, వస్త్రాలతో అలంకరించారు. ఆలయ అవరణలో హోమాన్ని నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి రాత్రి వరకు భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి తరలి వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు మహా అన్నదానం నిర్వహించారు. శ్రీదత్త నవరాత్రులు పరిసమాప్తం అయ్యాయి. ఆలయంలో రాత్రి జరిగిన భజన కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సైన్స్ ఫెయిర్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

రామగిరి, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లా సైన్స్ ఫెయిర్‌లో రామగిరి మండలంలోని వాణి సెకండరీ, ప్రగతి పాఠశాల విద్యార్థులు తమ ప్రతిభను కనబరిచారు. శుక్రవారం ఎన్‌టీపీసీ టీటీఎస్‌లోని జడ్పీ స్కూల్‌లో మూడు రోజుల పాటు నిర్వహించిన జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్ ఎగ్జిబిషన్, ఇన్‌స్పైర్‌లోని పలు విభాగాల్లో వాణి పాఠశాల పదవి తరగతికి చెందిన సహస్ర అనే విద్యార్థిని రిసోర్స్ మేనేజ్‌మెంట్ కాంతి విభాగంలో డిజాస్టర్ మేనేజ్‌మెంట్ విభాగంలో 9వ తరగతికి చెందిన విద్యార్థులు ఉమేశ్, సాయి, రాహుల్, నాచురల్ ట్రన్స్‌పోర్ట్ అండ్ ఫార్మింగ్ విభాగంలో రినేష్‌లు ప్రథమ స్థానంలో నిలిచాడు. అదే విధంగా ప్రగతి పాఠశాలకు చెందిన విద్యార్థులు జూనియర్ లేవెల్ విభాగంలో ఫూడ్, హెల్త్ అండ్ హైజిన్‌లో అంజనశ్రీ, వర్షిని జిల్లా స్థాయిలో ద్వితీయ విభాగంలో నిలువగా సీనియర్ లెవల్ విభాగంలో మ్యాస్-పార్క్ జిల్లా స్థాయిలో సహస్ర, అంజుమ్ జబీన్‌లకు ద్వితీయ స్థానంలో నిలిచారు. విద్యార్థులను జిల్లా విద్యాధికారి మాధవి షీల్డులు అందజేశారు. పాఠశాలల్లో వేర్వేరుగా జరిగిన కార్యక్రమాల్లో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయుల బృందం విద్యార్థులను అభినందించారు.



గనులపై భద్రతా పక్షోత్సవాలు



కార్యక్రమంలో మాట్లాడుతున్న జీఎం సుధాకర్‌రావు

రామగిరి, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : సింగరేణి ఆర్జీ-3 డివిజన్ పరిధిలోని ఓసీపీ-2లో భద్రతా పక్షోత్సవాలు ఘనంగా నిర్వహించారు. శనివారం ఓసీపీ-2ను భద్రత తనిఖీ బృందం కన్వీనర్ బైద్య, కమిటీ బృందం సభ్యులు పర్యటించారు. ఈ సందర్భంగా భద్రతపరమైన అంశాలపై జీఎం సూర్యనారాయణ, కన్వీనర్ బైద్యులు కార్మికుల్లో అవగాహన కల్పించారు. వివిధ ట్రేడ్ టెస్టుల విజేతలకు బహుమతులను అందజేశారు. ఆర్జీ-3 జీఎం సుధాకర్‌రావు, రీజియన్ సేఫ్టీ జీఎం గుప్తా, ప్రాజెక్టు అధికారి వెంకటరమణ, అధికారులు రామ్మోహన్, చంద్రశేఖర్, రామారావు, యాసిన్, షేక్ మిన్హాజుద్దీన్, వీరన్న, దయాకర్, ప్రసాద్, ఆదినారయణ, మురళికృష్ణ, వెంకటేశ్వర్లు, రాజు, నాయకులు కొటరవీందర్‌రెడ్డి, ఎంఆర్‌సి రెడ్డి, వెంకటస్వామి, మనోహర్, తదితరులు పాల్గోన్నారు.

● యైటింక్లయిన్‌కాలనీ (ఆంధ్రజ్యోతి): ఓసీపీ-3 సీహెచ్‌పీలో శనివారం 55వ రక్షణ పక్షోత్సవాలు జరిగాయి. తనిఖీ బృందం కన్వీనర్ జీఎం(ఓసీపీలు, సీహెచ్‌పీలు) డీవీఎస్ సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో బృందం సీహెచ్‌పీలో చేపడుతున్న రక్షణ చర్యలను పరిశీలించారు. ఏరియా ఇంజనీర్ నరసింహారావు, సేఫ్టీ ఆఫీసర్ సంతోష్‌కుమార్, రీజియన్ సేఫ్టీ ఆఫీసర్ అశోక్‌కుమార్, సీహెచ్‌పీ ఇంచార్జి సదానందం, పిట్ సెక్రెటరీ సెగ్గెం శంకర్ పాల్గొన్నారు.

యంత్రాలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలి

యైటింక్లయిన్‌కాలనీ, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఓసీపీ-3 కృషిభవన్‌లో శనివారం జరిగిన మల్టీడిపార్ట్‌మెంటల్ ఉద్యోగులతో సమావేశమైంది. జీఎం వెంకటయ్య మాట్లాడుతూ కోట్లాది రూపాయలు వెచ్చించి కొనుగోలు చేసిన యంత్రాలను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని, యంత్రాల పని గంటలు పెరిగేలా ఉద్యోగులు దృష్టి సారించాలని సూచించారు. ఈసందర్భంగా 2024-25 కంపెనీ ఉత్పత్తి, ఉత్పాదకత, బొగ్గు రవాణా, భవిష్యత్తు ప్రణాళికలు, యంత్రాల వినియోగం, అమలవుతున్న సంక్షేమ కార్యక్రమాలు, కంపెనీ ముందున్న సవాళ్లపై అధికారులు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఉద్యోగులకు అవగాహన కల్పించారు. ఈసమావేశంలో ఏఐటీయూసీ బ్రాంచి సెక్రెటరీ జీ రవీందర్, సీఎంవోఏఐ ప్రతినిధి నర్సింహులు, పీవో మధుసూదన్, మల్టీడిపార్ట్‌మెంట్ టీం సభ్యులు పాల్గొన్నారు.

ఆటల పోటీలు

యైటింక్లయిన్‌కాలనీ, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): సింగరేణి ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం ఆర్జీ-2 యాజమాన్యం మహిళలకు ఆటల పోటీలను నిర్వహించింది. కమ్యూనిటీహాల్‌లో మహిళలు, చిన్నారులకు బాల్‌త్రో, రన్నింగ్, బాల్‌త్రో, మ్యూజిక్‌చైర్ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. పోటీల్లో గెలిచిన వారికి 23న జరగనున్న సింగరేణి డేలో బహుమతులు అందజేయనున్నట్టు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ సూపర్‌వైజర్ నరేందర్‌రెడ్డి, కమ్యూనికేషన్ సెల్, సేవా కోఆర్డినేటర్ దేవారెడ్డితో పాటు సేవా సమితి సభ్యులు, ఉద్యోగుల కుటుంబాలకు చెందిన మహిళలు పాల్గొన్నారు.

అన్ని గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించాలి

- పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు

ఓదెల, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : రానున్న సంక్రాంతి వరకు ప్రతి గ్రామంలో వైద్య పరీక్షల శిబిరాలను నిర్వహించాలని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని వివేకానంద విద్యాలయంలో మాజీ ఎంపీటీసీ బోడకుంట శంకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన గుండెజబ్బుల నిర్ధారణ, ఇతర వైద్య పరీక్షల శిబిరాన్ని ఎమ్మెల్యే విజయరమణారావు ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇలాంటి వైద్య శిబిరాలను ఉపయోగించుకోవాలని కోరారు. ప్రతి ఒక్కరు మూడు, ఆరు నెలలకొకసారి అన్ని రకాల వైద్య పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. వైద్య పరీక్షల వల్ల అనారోగ్య కారణాలు, రాబోయే ప్రాణాంతక రోగాలు బయట పడుతాయని తెలిపారు. బోడకుంట శంకర్, డాక్టర్ పూదరి దత్తగౌడ్ సహకారంతో నిర్వహించిన ఈ శిబిరంలో ఫార్చ్యూన్ మెడికేర్ ఆసుపత్రి వైద్యులు 317 మందికి వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మూల ప్రేమ్ సాగర్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ ఆళ్ల సుమన్‌రెడ్డి, చీకట్ల మొండయ్య, గీతాంజలి డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ పల్కపాటి రాజేశం కుమార్, గోపతి సదానందం, శిబిరం ఇన్‌చార్జి గజెల్లి గణేష్, లగిశెట్టి వంశీ, సునీల్‌రెడ్డి, రామంచ అనిల్, కిరణ్, రాకేష్ పాల్గొన్నారు.



వైద్య శిబిరం ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయరమణారావు

నమ్మి ఓట్లేస్తే పదేళ్లు నిలువు దోపిడీ..

ఏదో చేస్తారని నమ్మి ఓట్లేస్తే ప్రజలను బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిలువునా దోచుకున్నదని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో శనివారం రూపాయలు 72.8లక్షల 352 విలువైన కళ్యాణ్ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మూల ప్రేమ్ సాగర్‌రెడ్డి, సింగర్ చైర్మన్ ఆళ్ళ సుమన్‌రెడ్డి, చీకట్ల మొండయ్య, బైరి రవీందర్‌గౌడ్, చింతం కుమారస్వామి, నాగపూరి రవిగౌడ్, పిట్టల నర్సింగం, తహసీల్దార్ యాకయ్యతోపాటు మండలంలోని పలు గ్రామాలకు చెందిన మాజీ సర్పంచులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన

సుల్తానాబాద్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : సుల్తానాబాద్ పట్టణంలోని పాత జెండా నుంచి శంకరలింగం ఇంటి వరకు చేపట్టనున్న సీసీ రోడ్డు పనులకు శనివారం ఎమ్మెల్యే విజయరమణారావు శంకుస్థాపన చేశారు. చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన శంకుస్థాపన శిలాఫలకాన్ని ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుల్తానాబాద్ పట్టణ అభివృద్ధి కోసం చేయబోయే అభివృద్ధి పనులు గురించి వివరించారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్స న్ గాజుల లక్ష్మీ రాజమల్లు, వైస్ చైర్‌పర్సన్ బిరుదు సమత క్రిష్ణ, కౌన్సిలర్లు పారుపల్లి జ్ఞానేశ్వరి గుణపతి, నిశాత్ రఫీ, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా మహాసభలు

పెద్దపల్లి కల్చరల్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా మహాసభలు శనివారం జిల్లా కేంద్రంలో జరిగాయి. జిల్లా అధ్యక్షుడు కే లక్ష్మణ్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో రాష్ట్ర కార్యదర్శి కే రంజిత్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు పెండింగ్‌లో ఉన్న బిల్లుల్ని చెల్లించలేదన్నారు. ఉపాధ్యాయులు అందరూ చాలా రోజుల నుంచి వాటి కోసం ఎదురుచూస్తున్నారు కాబట్టి పెండింగ్‌లో ఉన్నటువంటి మెడికల్ బిల్లులు, సరెండర్ బిల్లులు జీపీఎఫ్ బకాయిలు పరిష్కరించి త్వరగా చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అదేవిధంగా 317 జీవో ద్వారా స్థానికతను కోల్పోయిన ఉపాధ్యాయులను సొంత జిల్లాలకు పంపించి న్యాయం చేయాలన్నారు. పీఆర్సీ కమిటీ పనులను వేగవంతం చేయించి పీఆర్సీ వేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కార్యదర్శి గోల్కొండ శ్రీధర్ మాట్లాడుతూ ఎస్ ఎస్ఏ, సీఆర్పీ, కేజీబీవీ ఇతర ఉద్యోగుల సర్వీస్ రెగ్యులరైజ్ చేసి బేసిక్ పే ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కాంపల్లి లక్ష్మణ్, జిల్లా ప్రధాన కార్యదర్శి గద్దె శ్రీనివాస్, కోశాధికారి గట్టు శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి కుమార్ స్వామి, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు తిరుపతి, ఇతర జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.